

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684



**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575



| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 29.05.2026 | సంపుటి: 3 | సంచిక: 117 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | FRIDAY | 29.05.2026 | VOLUME : 3 | ISSUE : 117 | PAGES: 8 | COST: 2/- |


# ప్రతి పౌరుడికి ఒకే సంక్షేమ కార్డు

**ఏఐతో లబ్ధిదారుల పూర్తి ప్రొఫైలింగ్**

- ఆధార్ తరహాలో యూనిక్ ఐడీపై ఆలోచన
- పథకాల పారదర్శకతకు రేవంత్ కొత్త ప్లాన్



**తెలంగాణ బ్యూరో, రాజముద్ర న్యూస్:**

రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో ఉండేలా 'సమగ్ర సంక్షేమ కార్డును (యూనిఫైడ్ కార్డు ) రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను

మిగతా 2వ పేజీలో..

## ఎన్టీఆర్ స్ఫూర్తితో సంక్షేమ పాలన



2

## సర్కారు నిర్ణయాన్ని సమర్థిస్తారా? ప్రజా వ్యతిరేకతకు సై అంటారా?

- 'రైతు డిస్కమ్' ఏర్పాటుపై నేడే టీజీఈఆర్‌సీ కీలక విచారణ
- తెలంగాణలో మూడో డిస్కమ్ తీవ్ర వివాదం
- జూన్ 2 నుంచే ప్రారంభించాలని పట్టుదల
- వ్యతిరేకిస్తున్న విద్యుత్ ఉద్యోగ సంఘాలు, మేధావులు
- అభిప్రాయ సేకరణలో 95 శాతం వ్యతిరేకత
- ఈఆర్‌సీ అనుమతి లేకున్నా పాలకవర్గం ఏర్పాటు
- కోర్టుకు వెళ్లకుండా యాజమాన్యం ముందస్తు కేవియట్

TELANGANA RYTHU POWER DISTRIBUTION COMPANY LIMITED
TGRPDCL

**తెలంగాణ బ్యూరో, మే 28, రాజముద్ర న్యూస్:**

తెలంగాణ విద్యుత్ శాఖలోని పంపిణీ వ్యవస్థను ముక్కలు చేసి, రైతు ప్రయోజనాల కోసమంటూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న 'రైతు డిస్కమ్' (మూడో డిస్కమ్) ఏర్పాటు వ్యవహారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నిరసనలకు, సందేహాలకు తావిస్తోంది. కళ్లముందే జరుగుతున్న నష్టాలను నిపుణులు వివరిస్తున్నా, మేధావులు హెచ్చరిస్తున్నా.. కొందరు ఉన్నతాధికారులు ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించి మరీ ఈ కొత్త డిస్కమ్

మిగతా 3వ పేజీలో..



## యూత్ డిక్లరేషన్ పోరులో బీఆర్ఎస్పీ నారాజ్

- మమ్మల్ని పక్కనపెట్టి పోరాటాలు ఎలా చేస్తారని ప్రశ్న
- సరూర్‌నగర్ సభ సన్నాహకాలపై విద్యార్థి విభాగం ఆగ్రహం
- కీలక సమావేశానికి ఆహ్వానం లేకపోవడంపై నేతల అసహనం
- 30న కేటీఆర్ సమావేశానికి తప్పనిసరిగా పిలవాలంటూ డిమాండ్

2

## ప్రజా పాలనలో సౌర క్రాంతి
## గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తెలంగాణ లక్ష్యం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**బోనకల్లు, రాజముద్ర న్యూస్:**

రాష్ట్రంలో పర్యావరణహిత ఇంధన వనరులను ప్రోత్సహిస్తూ తెలంగాణను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం గర్లపాడు గ్రామంలో గురువారం

మిగతా 3వ పేజీలో..





3

## రైతులారా అధైర్యపడకండి

- చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా
- దేశ చరిత్రలోనే రికార్డ్ స్థాయిలో 8,575 కొనుగోలు కేంద్రాలు

## అకాల వర్షాలనూ రాజకీయాల కోసం వాడుకోవద్దు




- అది రైతు గోస కాదు.. బీజేపీ రాజకీయ ఘోష
- బీఆర్ఎస్ డైవర్షన్ పాలి'ట్రిక్స్'
- మంత్రి ఫైర్

2



## దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ

- నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగర నిర్మాణం
- మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబుల వెల్లడి

3

## సివిల్ వర్కులు వేగవంతంగా పూర్తిచేయాలి

- సనత్ నగర్ టిమ్స్ పరిశీలించిన మంత్రి దామోదర్

2






## ఫ్యూచర్ సిటీ భూములకు రికార్డు ధరలు

- రావిర్యాలలో చదరపు గజం భూమి రూ.83,500లు
- విక్రయాల ద్వారా రూ 140 కోట్లు ఆదాయం
- హౌసింగ్ బోర్డు స్థలాలకు భారీ డిమాండ్

3



## తెలంగాణకు చల్లని కబురు

- రెండు రోజుల్లో రుతుపవనాల ఆగమనం

**హైదరాబాద్, మే 28, రాజముద్ర న్యూస్:**

తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ ఓ చల్లని కబురు అందించింది. ఎప్పుడెప్పుడా

మిగతా 2వ పేజీలో..

## కడియాలు, కమ్మల కోసం కాళ్లు నరికి.. గొంతు కోశారు..!

2

- చేవెళ్లలో మృగాళ్ల దారుణం... నిర్మానుష్య ప్రాంతంలో విగతజీవిగా మైసమ్మ
- మహిళ ప్రాణాలు తీసిన కిరాతకులు ... మృతురాలు కూలీ పనులు చేసుకునే నిరుపేద



## 2ను ఆర్టీసీ అపాయింటెడ్ డేగా ప్రకటించాలి

- ఎంపీలను కలిసి విన్నవించిన జేఏసీ నేతలు
- ఆర్టీసీ విలీనంపై స్పష్టత కోరుతూ 1న ఇందిరాపార్క్ వద్ద దీక్ష

2



# కడియాలు, కమ్మల కోసం కాళ్లు నరికి.. గొంతు కోశారు..!

- మహిళ ప్రాణాలు తీసిన కిరాతకులు
- చేవెళ్లలో మృగాళ్ల దారుణం
- నిర్మానుష్య ప్రాంతంలో విగతజీవిగా మైసమ్మ
- మృతురాలు కూలీ పనులు చేసుకునే నిరుపేద
- ఘటనతో స్థానికుల్లో వ్యక్తమవుతున్న భయాందోళనలు

**తెలంగాణ బ్యూరో**

ఆభరణాలపై పెంచుకున్న అత్యాశ మానవత్వాన్ని పూర్తిగా మింగేసింది. కేవలం కడియాలు, చెవి కమ్మల కోసం ఓ అమాయక మహిళను అత్యంత క్రూరంగా గొంతు కోసి హత్య చేయడమే కాకుండా, ఆమె కాళ్లను నరికేసిన అమానుష ఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలంలో కలకలం రేపింది. పసిడి, వెండి కోసం ఒక ప్రాణాన్నే బలి తీసుకున్న ఈ దారుణ మృగత్వం స్థానిక సమాజాన్ని తీవ్రంగా కలచివేస్తోంది. మనిషిలో దాగి ఉన్న క్రూరత్వాన్ని వెలికితీసిన ఈ కిరాతక ఘటన చేవెళ్ల పరిసర ప్రాంతాల్లో తీవ్ర భయాందోళనలకు కారణమవుతోంది.

**నిర్మానుష్య ప్రాంతంలో శవమై**

పోలీసులు మరియు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలంలోని గొల్లపల్లి అనుబంధ గ్రామం ధర్మసాగర్‌కు చెందిన ఎరుకుల మైసమ్మ (48) కొన్నేళ్ల క్రితమే తన భర్తను కోల్పోయింది. అప్పటి నుండి ఆమె కూలీ పనులు చేసుకుంటూ ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఆమె కొడుకు సురేశ్‌కు వివాహం కావడంతో అతను భార్యతో కలిసి వేరే ఇళ్లలో ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం వేళ నిత్యం లాగే ఇంటి నుంచి బయటకు వెళ్లిన మైసమ్మ.. రాత్రి దాటినా తిరిగి రాకపోవడంతో, బుధవారం మధ్యాహ్నం ఈర్లపల్లి సమీపంలోని ఒక నిర్మానుష్య ప్రదేశంలో ఆమె మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

**50 తులాల వెండి కోసం ఏకంగా కాళ్లే నరికేశారు..**

ఘటనాస్థలికి చేరుకున్న చేవెళ్ల పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా, దుండగులు మైసమ్మను నమ్మించి లేదా బలవంతంగా ఆ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి, మొదట గొంతు కోసి అత్యంత దారుణంగా హత్య చేసినట్లు తేలింది. అయితే, ఈ హత్య వెనుక ఉన్న అసలు కారణం తెలిశాక పోలీసులతో పాటు స్థానికులు సైతం దిగ్భ్రాంతికి గురయ్యారు. మైసమ్మ కాళ్లకు ఉన్న సుమారు 50 తులాల వెండి కడియాలు తీయడానికి రాకపోవడంతో, ఆ నరరూప రాక్షసులు ఏకంగా ఆమె రెండు కాళ్లను నరికి ఆ కడియాలతో పాటు చెవులకు ఉన్న కమ్మలను కూడా దోచుకెళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేవలం నగలను దొంగిలించాలన్న దుర్బుద్ధితోనే ఈ వికృత చేష్టలకు పాల్పడినట్లు స్పష్టమవుతోంది.

**తాగిన మత్తులోనే దారుణం..**

పక్కా ప్లాన్ ప్రకారమే ఒంటరి మహిళను టార్గెట్ చేసుకుని, తాగిన మత్తులో ఉన్న కొందరు వ్యక్తులు ఈ దారుణానికి ఒడిగట్టి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘోర ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తును వేగవంతం చేసినట్లు చేవెళ్ల సీఐ భూపాల్‌శ్రీధర్ మీడియాకు తెలిపారు. చేవెళ్లలో చోటుచేసుకున్న ఈ దారుణ ఘటన గ్రామీణ ప్రాంతాల ప్రజల్లో సరికొత్త భయాన్ని సృష్టిస్తోంది. కేవలం ఒంటిపై ఉన్న నగలు, కడియాల కోసం ఇంత క్రూరంగా కాళ్లు నరికి చంపేస్తుంటే.. ఇకపై గ్రామాల్లో ఒంటరిగా తిరిగే మహిళలకు రక్షణ ఎక్కడుంటుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పోలీసులు ఇలాంటి అసాంఘిక శక్తులపై గట్టి నిఘా పెట్టి, నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అకాల వర్షా లనూ రాజకీయాల కోసం వాడుకోవద్దు

**హైదరాబాద్, మే 28 :**

అకాల వర్షాలనూ మీ రాజకీయాల కోసం వాడుకోవద్దని ప్రతిపక్షాలకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చురకలంటించారు. పన్నెండేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉండి రైతుల ఆదాయం రెట్టింపు చేయకపోగా ఎరువుల ధరలు పెంచి, నల్ల చట్టాలతో తీవ్ర అన్యాయం చేసిన బీజేపీ.. ఇవాళ తెలంగాణలో రైతు గోసబీజేపీ భరోసా పేరిట పొలిటికల్ యాత్రలు చేస్తోందని గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. అది 'రైతు గోస' కాదని.. అధికారం కోసం బీజేపీ నాయకులు పెడుతున్న 'రాజకీయ ఘోష' అని మండిపడ్డారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులను పూర్తి స్థాయిలో అమలు చేయకుండా అన్నదాతలకు అన్యాయం చేస్తున్నదెవరో ముందు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నాడు తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనుగోలు చేయమని అడగటానికి వెళ్తే మీ వాళ్లకు నూకలు తినటం అలవాటు చేయండంటూ అవమానించిన మీ కేంద్ర మంత్రుల చరిత్రను మర్చిపోయారా అని బీజేపీ నాయకులను మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. అప్పట్లో మన రైతుల పక్షాన నిలబడకుండా ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారా అంటూ ఎద్దేవా చేశారు. నిజంగా రైతులపై ప్రేమ ఉంటే ఇక్కడ పొలిటికల్ టూర్లు చేస్తూ కాలక్షేపం చేయక దిల్లీకి వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి తెలంగాణ రైతాంగానికి న్యాయంగా రావాల్సిన హక్కులను, నిధుల్ని సాధించుకు రావాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు తలెత్తినప్పుడు రైతాంగానికి ధైర్యం చెప్పి బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా అన్నదాతలకు అండగా నిలవాల్సిన బీఆర్ఎస్.. ఆ పని పక్కనబెట్టి కేవలం రాజకీయ ఉనికి కోసం ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడమే లక్ష్యంగా పెట్టుకోవడం సిగ్గుచేటు అని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వం పారదర్శకంగా, రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరుపుతుంటే ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా డైవర్షన్ పాలి'ట్రిక్స్' చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు ఎన్ని ఆటంకాలు సృష్టించినా, ఎన్ని కుట్రలు చేసినా చివరి గింజ కొనే వరకు అన్నదాతలకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల దుష్ప్రచారాన్ని నమ్మి ఆందోళనకు గురికావద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణకు చల్లని కబురు

**మొదటిపేజీ తరువాయి**

అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతూ రెండు రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయని వెల్లడించింది. ఈ రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడటమే కాకుండా రాగల మూడు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా విస్తరించడానికి ముందు రాబోయే రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉందని పేర్కొంది. అందువల్ల రుతుపవనాలు పూర్తిగా ప్రవేశించే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండ తీవ్రత దృష్ట్యా మధ్యాహ్నం వేళల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.



# ప్రతి పౌరుడికి ఒకే సంక్షేమ కార్డు

**మొదటిపేజీ తరువాయి**

ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలని సూచించారు. తక్షణమే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీఎస్ రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితర ఉన్నతాధికారుల సమీక్షలో సీఎం ఈ విషయాన్ని ప్రత్యేకంగా చర్చించారు.సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకేచోట అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఏఐ సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందన్నారు. నిజమైన అర్హులకు పథకాలు మరింత కచ్చితంగా చేరుతాయన్నారు. అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు.ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు, ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని సీఎం సూచించారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ ప్రభుత్వ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు. ఈ కార్డులో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, ఇన్సూరెన్స్ పథకాలు, ప్రభుత్వం తీసుకువస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని చెప్పారు. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చేలా ఆలోచించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ కార్డ్‌కు అనుసంధానించాలన్నారు. లబ్ధిదారుల వివరాలతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు.ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ ఉండాలని సీఎం సూచించారు ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే, ఆ సమాచారం చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరాలని,వెంటనే దాని ఆధారంగా చర్యలు మొదలయ్యేలా ఉండాలన్నారు. ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా సమగ్ర సంక్షేమ కార్డ్ తో లింక్ చేయాలని చెప్పారు.కేరళ నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లే ఉద్యోగులకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు, పాస్‌పోర్ట్‌లు, వీసాల జారీకి సంబంధించిన సమాచారం ఒకేచోట అందుబాటులో ఉంచితే, అనధికార ఏజెంట్ల ప్రమేయం తగ్గుతుందని తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా, ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసేలా సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఎన్టీఆర్ స్ఫూర్తితో సంక్షేమ పాలన

- ఇందిరమ్మ ఆశయాలతో అభివృద్ధి కార్యక్రమాలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మే 28 :**



ఉక్కు మహిళ ఇందిరా గాంధీ, తెలుగుజాతి గర్వించదగిన నాయకుడు నందమూరి తారక రామారావు స్ఫూర్తితో రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ అమీర్‌పేట్ మైత్రివనం చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ దేశ చరిత్రను తెలుసుకోవాలన్నా, స్ఫూర్తి పొందాలన్నా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఇందిరా గాంధీ, ఎన్టీఆర్‌లను స్మరించుకోవాలని అన్నారు. ఈ దేశం ఉన్నంతకాలం వారి కీర్తి ప్రతిష్టలు నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్ నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకుడని సీఎం కొనియాడారు. కులాలు, మతాలు, భాషలకు అతీతంగా ప్రజల హృదయాల్లో నిలిచిన మహానాయకుడని అన్నారు. తెలంగాణకు చెందిన అనేక మంది నాయకులకు ఎన్టీఆర్ రాజకీయ భిక్ష పెట్టారని గుర్తుచేశారు. భావితరాలకు ఆయన స్ఫూర్తిని అందించేందుకే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని తెలిపారు. తెలంగాణను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ముప్పై వేల ఎకరాల్లో ప్రతిష్టాత్మక భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ప్రపంచ దిగ్గజ సంస్థలను తెలంగాణకు తీసుకురావడంతో పాటు యువతను ఆ సంస్థల యజమానులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో మూడు కోట్ల ఇరవై నాలుగు లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని సీఎం తెలిపారు. ఎన్టీఆర్ అమలు చేసిన రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం తమకు స్ఫూర్తి అని అన్నారు. కూడు, గుడ్డ, నీడ అనే భావనతోనే ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. జనతా వస్త్రాల పథకం స్ఫూర్తితో ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఇందిరమ్మ ఆశీర్వాదం, ఎన్టీఆర్ స్ఫూర్తి ప్రజాపాలనలో ప్రతిఫలిస్తోందని అన్నారు. మహిళలకు ముప్పై మూడు శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్‌లో మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 2ను ఆర్టీసీ అపాయింటెడ్ డేగా ప్రకటించాలి

- ఎంపీలను కలిసి విన్నవించిన జేఏసీ నేతలు
- ఆర్టీసీ విలీనంపై స్పష్టత కోరుతూ 1న ఇందిరాపార్క్ వద్ద దీక్ష
- తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ప్రకటన

**హైదరాబాద్, మే 28 :**

ఆర్టీసీ ఎన్నికల కంటే ముందుగానే జూన్ 2న విలీనం అపాయింటెడ్ డేట్‌ను ప్రభుత్వం ప్రకటించాలని టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రాజకీయ ప్రధాన సలహాదారు, ఎంపీ వేం నరేందర్ రెడ్డిని, ఎంపీ రఘురామ్‌రెడ్డిని జేఏసీ నాయకులు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీలో గుర్తింపు ఎన్నికలు జరిగిన తరువాతనే విలీనం పక్రియను ప్రారంభిస్తామని రవాణా శాఖ మంత్రి ఇటీవల వెల్లడించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను చెల్లించడానికి ప్రభుత్వం తగిన నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎండీ మౌలానా, కో కన్వీనర్ కత్తుల యాదయ్య, కో కన్వీనర్లు సుద్దాల సురేష్, యాదగిరి, బాబు, బుద్ధ విశాల్, రవికిరణ్ పాల్గొన్నారు. ఇదిలావుంటే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు అపాయింటెడ్ డే ప్రకటించాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ య□నియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జూన్ 1న ఇందిరా పార్క్ వద్ద సామూహిక దీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. య□నియన్ ఎన్నికలకు ముందుగా ఉద్యోగుల పక్రియ పూర్తిచేయాలని, 2026 మే 1 నుంచి అపాయింటెడ్ డే ప్రకటించాలని టీజేఎంయూ నాయకులు డిమాండ్ చేశారు. అపాయింటెడ్ డే కంటే ముందుగా యూనియన్ ఎన్నికలు నిర్వహిస్తామని రవాణా శాఖ మంత్రి ప్రకటించడంతో ఉద్యోగుల్లో అయోమయం నెలకొందని అభిప్రాయపడ్డారు. జూన్ 1న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇందిరాపార్కు వద్ద దీక్ష నిర్వహించనున్నట్లు టీజేఎంయూ వ్యవస్థాపక రాష్ట్ర కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ తెలిపారు. ప్రభుత్వంలో విలీనం కోరుకునే ఉద్యోగులంతా యూనియన్లకు అతీతంగా ఈ దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షకు తెలంగాణ ఆర్టీసీ కార్మిక సమాఖ్య కూడా మద్దతు ప్రకటించింది. యాజమాన్యం వద్ద పరిష్కారం కావాల్సిన 29 సమస్యలపై చర్చలు కొనసాగుతున్న సమయంలో ఎన్నికలకు వెళ్లడం వల్ల కార్మికులు నష్టపోతారని కార్మిక సమాఖ్య నాయకుడు కె.రాజిరెడ్డి తెలిపారు. విలీనం అనంతరం యూనియన్లు కొనసాగితే ఎన్నికల అంశాన్ని పరిశీలించాలన్నారు. విలీనానికి సంబంధించిన విధివిధానాలు రూపొందించే కమిటీలో ప్రతి యూనియన్‌కు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. అపాయింటెడ్ డే ప్రకటించే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# సివిల్ వర్కులు వేగవంతంగా పూర్తిచేయాలి

**హైదరాబాద్, మే 28 :**

అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన సనత్‌నగర్ టిమ్స్ హాస్పిటల్‌లో చేపట్టిన సివిల్ వర్క్‌లను శరవేగంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. హాస్పిటల్‌లో ఆధునిక పరికరాలు, వైద్య సదుపాయాలు, ఇన్‌ఫ్రా□, ల్యాబొరేటరీ, బ్లడ్ బ్యాంకులను గురువారం పరిశీలించారు. ఆస్పత్రి ప్రాంగణంలో డాక్టర్లకు విడివిడిగా బాయ్స్, గర్ల్స్ హాస్టల్ బ్లాక్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఔట్ పేషంట్, ఇన్ పేషంట్‌ల అవసరమైన టాయిలెట్ బ్లాక్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. హాస్పిటల్ ప్రాంగణంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా మల్టీ లెవెల్ పార్కింగ్ సిస్టంను అభివృద్ధి చేయాలని, రోగుల సహాయకుల కోసం ధర్మశాల, హాస్పిటల్‌లో రెండు క్యాంటీన్‌లను ఏర్పాటు చేయాలని, పరిపాలన భవనం, టీబీ హాస్పిటల్ బోర్డు ఆఫీసు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రధాన ద్వారంలో పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తున్న హాస్పిటల్‌లో డ్రైనేజీ, శానిటేషన్ నిర్వహణ, వాటర్ సప్లై వంటి సేవలు నిరంతరం కొనసాగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆస్పత్రిలో అధునాతన ఇంటీరియర్, లాంజ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. విదేశీ రోగుల కోసం ఏర్పాటు చేసిన బ్లాక్స్‌లో ఆధునిక సౌకర్యాలకు పెద్దపీట వేయాలని సూచించారు. అంతర్జాతీయ స్థాయి లేబరేటరీ ఏర్పాటుపై డీఎంఈ, హెచ్‌వోడీ, వైద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో కమిటీని మంత్రి ఏర్పాటు చేశారు. టిమ్స్ పూర్తిస్థాయిలో ప్రారంభించేందుకు అవసరమైన కొనసాగింపు పనులు పూర్తి చేసేందుకు అంచనాలను రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.



అనంతరం ప్రతిపాదిత పరిపాలన భవనంలో ఆస్పత్రి నిర్వహణ, మెరుగైన వైద్య సేవల కల్పన, సివిల్ వర్క్స్‌ను శరవేగంగా పూర్తి చేయడంపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ లక్ష్యాలు, హాస్పిటల్ నిర్వహణ, మెరుగైన వైద్య సేవల కల్పనపై వైద్య, ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి దిశా నిర్దేశనం చేశారు. మంత్రి వెంట వైద్య ఆరోగ్య ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు, రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, తెలంగాణ వైద్య, మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఎండీ హనుమంతు, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, ఆర్ అండ్ బి శాఖ ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

# యూత్ డిక్లరేషన్ పోరులో బీఆర్ఎస్వీ నారాజ్

**తెలంగాణ బ్యూరో, మే 28**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటాలను ఉద్ధృతం చేయాలని భావిస్తున్న బీఆర్ఎస్‌లో అంతర్గత అసంతృప్తి బయటపడుతోంది. ముఖ్యంగా యూత్ డిక్లరేషన్ అమలు డిమాండ్‌తో చేపట్టనున్న ఉద్యమంలో తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ పార్టీ విద్యార్థి విభాగం బీఆర్ఎస్వీ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై జరిగే పోరాటంలో తమను పక్కనపెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలపై ఉద్యమాలను వేగవంతం చేయాలని బీఆర్ఎస్ అధిష్ఠానం నిర్ణయించింది. ఇప్పటికే రైతు డిక్లరేషన్ అమలు డిమాండ్‌తో నిర్వహించిన సభ విజయవంతమైందని భావిస్తున్న పార్టీ నేతలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రకటించిన యూత్ డిక్లరేషన్ అంశాన్ని ముందుకు తీసుకొస్తున్నారు. ఎన్నికల ముందు సరూర్‌నగర్‌లో కాంగ్రెస్ ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ "చలో సరూర్‌నగర్" పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పాత జీహెచ్ఎంసీ పరిధిలోని గులాబీ ఎమ్మెల్యేలు ఇటీవల సమావేశమై కార్యాచరణపై చర్చించారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించి పోరాట కార్యాచరణను ప్రకటించారు.

అయితే ఈ సమావేశానికి తమను ఆహ్వానించకపోవడంపై బీఆర్ఎస్వీ నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. యూత్ డిక్లరేషన్ ప్రధానంగా విద్యార్థులు, నిరుద్యోగులకు సంబంధించిన అంశమని, అలాంటి సమావేశంలో విద్యార్థి విభాగం నేతలకు చోటు లేకపోవడం అవమానకరమని భావిస్తున్నారట. పార్టీ చేపట్టే ప్రతి ఉద్యమంలో ముందుండేది విద్యార్థి విభాగమేనని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తూ ఇప్పటికే అనేక కేసులు ఎదుర్కొంటున్నామని గుర్తుచేస్తున్నారు. పార్టీకి అవసరమైనప్పుడు ఉద్యమాలకు పంపించి, కీలక నిర్ణయాల సమయంలో మాత్రం దూరం పెడుతున్నారనే భావన విద్యార్థి నేతల్లో వ్యక్తమవుతోందని సమాచారం. కనీసం మీడియా సమావేశానికైనా పిలిచి ఉంటే బాగుండేదని వారు అభిప్రాయపడుతున్నట్టు తెలిసింది. మరోవైపు ఇది యూత్ డిక్లరేషన్‌కు సంబంధించిన అంశం కావడంతో పార్టీ యువజన విభాగానికే ప్రాధాన్యం ఇచ్చామని కొందరు ఎమ్మెల్యేలు వివరణ ఇస్తున్నారు. విద్యార్థి విభాగానికి చెందిన కొందరు నేతలను సంప్రదించే ప్రయత్నం చేసినప్పటికీ అందుబాటులో లేరని చెబుతున్నారు. అయితే ఈనెల 30న కేటీఆర్ సమక్షంలో జరిగే సన్నాహక సమావేశానికి తమను తప్పనిసరిగా ఆహ్వానించాలని బీఆర్ఎస్వీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై జరిగే ఉద్యమాల్లో విద్యార్థి విభాగమే ముందుంటుందని, తమకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు నిర్వహించడం బాధాకరమని వారు అంటున్నారు.

# ప్రజా పాలనలో సౌర క్రాంతి

## గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తెలంగాణ లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

ఆయన సోలార్ ప్రాజెక్టులను ప్రారంభించి మాట్లాడారు. బోనకల్, కొడంగల్ మండలాలను రాష్ట్రంలో తొలి సంపూర్ణ సోలరైజేషన్ మండలాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రైతుల పొలాల్లో ఏర్పాటు చేస్తున్న సోలార్ పంపుసెట్లు సాగునీటితో పాటు మిగులు విద్యుత్ ద్వారా అదనపు ఆదాయం అందిస్తాయని చెప్పారు. ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు వల్ల కరెంటు ఖర్చు తగ్గడంతో పాటు నెలకు రూ.500 వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు.

రాష్ట్రంలో 81 గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా అభివృద్ధి చేస్తున్నామని, మహిళా సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రతి జిల్లాలో ఇందిరా మహిళా శక్తి సంఘాలకు 2 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 18,542 మెగావాట్లకు పెరిగినా ఎక్కడా అంతరాయం లేకుండా ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్ అందిస్తోందని భట్టి చెప్పారు. ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ బలోపేతం, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, అదనపు విద్యుత్ ఉత్పత్తితో సమస్యలు రాకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు.

అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. రైతుల కన్నీళ్లు తుడవడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమన్నారు. మొక్కజొన్న కొనుగోళ్ల కోసం రూ.5 వేల కోట్లు విడుదల చేశామని తెలిపారు.

ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాలు వాస్తవాలు గుర్తించాలని భట్టి సూచించారు. హరీష్ రావు కట్టుకథలు మానుకోవాలని హితవు పలికారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేసిన కొనుగోళ్లతో సమానంగా కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లలో ధాన్యం కొనుగోలు చేసిందని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం తెలంగాణ సేకరించిన ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం వైఖరి మార్చుకోకపోతే రైతులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని హెచ్చరించారు. రైతులకు ఉచిత విద్యుత్, బోనస్‌తో మద్దతు ధర అందిస్తూ వ్యవసాయాన్ని పండగలా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు.

# సర్కారు నిర్ణయాన్ని సమర్థిస్తారా?

# ప్రజా వ్యతిరేకతకు సై అంటారా?

**మొదటిపేజీ తరువాయి**

ఏర్పాటుకు పావులు కదుపుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ నేడు నిర్వహించబోయే బహిరంగ విచారణ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రజాభిప్రాయాన్ని గౌరవించి ఈఆర్సీ స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటుందా? లేక ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గి లైసెన్స్ జారీ చేస్తుందా? అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

95 శాతం మంది వ్యతిరేకత.. మూడో డిస్కమ్ ఏర్పాటుపై తెలంగాణ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (టీజీఈఆర్సీ) సలహాలు, అభిప్రాయాలు కోరుతూ గతంలో బహిరంగ ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 18వ తేదీ నాటికి ఈఆర్సీకి మొత్తం 32 సంస్థలు, విభిన్న వర్గాల ప్రముఖుల నుండి లేఖలు అందగా.. అందులో దాదాపు 90 నుండి 95 శాతం మంది మూడో డిస్కమ్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించినట్లు విశ్వసనీయ సమాచారం. మెజారిటీ వర్గాల నుండి ఇంతటి వ్యతిరేకత వ్యక్తమైన సమయంలో, ప్రజాభిప్రాయాన్ని బేఖాతరు చేస్తూ రైతు డిస్కమ్‌కు అనుమతులు ఇచ్చి లైసెన్స్ జారీ చేస్తే, కమిషన్ తన స్వయంప్రతిపత్తిని కోల్పోయిందనే అపవాదును మూటగట్టుకోవాల్సి వస్తుందని ఈఆర్సీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. నేటి విచారణలో ఫిర్యాదుదారుల వాదనలు విన్న తర్వాతే కమిషన్ తన తుది నిర్ణయాన్ని వెల్లడించనుంది.

**అనుమతి లేకముందే ఆరంభం..**

ప్రస్తుతం ఉన్న రెండు డిస్కమ్‌ల (టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్‌పీడీసీఎల్) పరిధిలో ఉన్న వ్యవసాయం, ఎత్తిపోతల పథకాలు, మిషన్ భగీరథ, మున్సిపల్ నీటి సరఫరా వంటి విభాగాలకు చెందిన సుమారు 29.08 లక్షల కనెక్షన్లను వేరు చేసి ఈ కొత్త డిస్కమ్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం... భావిస్తోంది. అయితే, ఈ విభజన వల్ల అటు ప్రభుత్వానికి, ఇటు విద్యుత్ సంస్థలకు లేదా రైతులకు ఏ ఒక్క వర్గానికి కూడా నయాపైసా ఉపయోగం లేదని విద్యుత్ నిపుణులు కొట్టిపారేస్తున్నారు. ఇంకా విచిత్రమేమిటంటే, ఈఆర్సీ నుండి ఎలాంటి అధికారిక అనుమతులు రాకముందే, అనధికారికంగా రైతు డిస్కమ్‌కు పాలక వర్గాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఆస్తులు, అప్పుల విభజన కసరత్తు కూడా పూర్తి చేసేశారు. న్యాయ వ్యవస్థతో సమానమైన ఈఆర్సీని అవమానించేలా యాజమాన్యం వ్యవహరిస్తోందని, కేవలం ప్రభుత్వ పెద్దల మెప్పు కోసమే బ్యూరోక్రాట్లు అల్లిన సాలీడు గూడు ఇదని మేధావులు మండిపడుతున్నారు.

**రోజుకో మాట మారుస్తున్న యాజమాన్యం!**

కొత్త డిస్కమ్‌కు అవసరమైన ఉద్యోగుల విభజనపై విద్యుత్ సంస్థల యాజమాన్యం రోజుకో కొత్త విధానాన్ని తెరపైకి తెస్తోంది. ఇక్కడ ఖాళీగా ఉన్న పోస్టుల కంటే రెట్టింపు సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, దాని వెనుక అసలు రహస్యం వేరే ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న వారు, చాలా కాలంగా ప్రమోషన్లు లేని వారికి 'పదోన్నతుల ఎర' వేయడం.. అలాగే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పనిచేసే అవకాశం దక్కుతుందనే ఆశతోనే దరఖాస్తులు వచ్చాయని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. ఇటు జెన్‌కోలో కొంత భాగాన్ని ప్రైవేట్‌పరం చేసి, అక్కడ మిగిలిపోయే ఇంజనీర్లను, సిబ్బందిని ఈ రైతు డిస్కమ్‌కు బదిలీ చేయాలనే మరో ఆలోచన కూడా యాజమాన్యం చేస్తోంది. ఉద్యోగులు తమ హక్కుల పరిరక్షణ కోసం ఎక్కడ కోర్టులను ఆశ్రయిస్తారోననే భయంతో విద్యుత్ సంస్థలు ముందస్తుగానే 'కేవియట్' దాఖలు చేయడం వారి అభద్రతాభావాన్ని తెలియజేస్తోంది.

**లక్షలాది కనెక్షన్లు.. కొద్దిమంది సిబ్బందితో సాధ్యమేనా?**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 30 లక్షలకు పైగా వ్యవసాయ, ప్రభుత్వ కనెక్షన్లు, లక్షలాదిగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణను కేవలం కొద్దిమంది సిబ్బందితో కొత్త డిస్కమ్ ఎలా నడపగలదనేది పెద్ద యక్షప్రశ్నగా మారింది. క్షేత్రస్థాయిలో లైన్ మెన్లు, సబ్‌స్టేషన్ సిబ్బంది కొరత తీవ్రంగా వేధించనుందని, దీనివల్ల భవిష్యత్తులో రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందడం అసాధ్యంగా మారుతుందని రైతు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్త డిస్కమ్ పేరిట సరికొత్త నిబంధనలు తీసుకువచ్చి భవిష్యత్తులో వ్యవసాయ ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టేందుకే ఈ కుట్ర జరుగుతోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జూన్ 2వ తేదీన ఎలాగైనా ఈ డిస్కమ్‌ను ప్రారంభించాలని ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్న వేళ.. నేటి ఈఆర్సీ విచారణ తీర్పు ప్రజాభిప్రాయానికి అనుకూలంగా ఉంటుందా, లేక ప్రభుత్వం చెప్పినట్లే వింటుందా అనేది విద్యుత్ రంగ భవిష్యత్తును శాసించనుంది.

# ఫ్యూచర్ సిటీ భూములకు రికార్డు ధరలు

**హైదరాబాద్, మే 28 :**

రాజధాని క్యూర్ పరిధిలో పెద్దపెద్ద వెంచర్లు చేపట్టడానికి అనువుగా ఉన్న భూములకు భారీగా డిమాండ్ పెరుగుతోంది. అందులోనూ ఎలాంటి వివాదాలు లేకుండా క్లియర్ టైటిల్‌తో ప్రభుత్వానికి చెందిన హౌసింగ్ బోర్డు స్థలాలకు డిమాండ్ మరింత భారీగా ఉంటోంది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం ఫ్యూచర్ సిటీ ఎంట్రన్స్‌లో ఎయిర్‌పోర్టుకు సమీపంలోని రావిర్యాలలో భూములను కొనుగోలు చేయడానికి అనేకమంది పోటీపడ్డారు. ఈ ప్రాంతలో ఉన్న హౌసింగ్ బోర్డు భూములకు గురువారం ఇవేలం నిర్వహించారు. మొత్తం నాలుగు భూమలకు నిర్వహించిన వేలంపాటలో చదరపు గజం భూమి గరిష్టంగా రూ.83,500కు అమ్ముడుపోయిందని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతం తెలిపారు. వెయ్యినుంచి 13,500 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న నాలుగు లాండ్ పార్సిళ్లకు నిర్వహించిన వేలం పాట ద్వారా సుమారు రూ.140 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. ఈ భూములను ఇఆక్షన్‌లో విక్రయిస్తున్నట్లు గత నెలలో హౌసింగ్ బోర్డు ప్రకటన ఇచ్చింది. ఈ భూములను కొనుగోలు చేయడానికి సుమారు 17 సంస్థలు పోటీపడ్డాయి. ఇందులో 1113 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న భూమిని కొనుగోలు చేయడానికి బిడ్డర్లు పోటీ పడ్డారు. రూ.26 వేల కనీస ధరను నిర్ధారించగా దీనిని దక్కించుకోడానికి పోటీపడుతూ చదరపు గజం రూ.83,500కు ఒక డెవలపర్ సంస్థ దక్కించుకుంది. అలాగే ఇదే ప్రాంతంలోని సుమారు ఆరు వేల చదరపు గజాల విస్తీర్ణంలోని భూమి వేలం పాటలో చదరపు గజం రూ.62,500 ధరకు అమ్ముడుపోయింది. అంతేకాక సుమారు 13,500 చదరపు గజాల విస్తీర్ణంలోని భూమిని కొనుగోలు చేయడానికి కూడా బిడ్డర్లు పోటీ పడ్డారు. ఈ నాలుగు భూముల వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు సుమారు రూ.140 కోట్ల మేర ఆదాయం వచ్చింది.

**నేడు కూడా భూముల విక్రయాలు**

కేపీహెచ్‌బి కాలనీ, కుత్బుల్లాపూర్ చింతల్ ప్రాంతాల్లోని మరో నాలుగు ప్లాట్లకు (భూములకు) శుక్రవారం ఇఆక్షన్ నిర్వహిస్తున్నారు. కేపీహెచ్‌బి కాలనీ ఫేజ్ 12లోని 5,898 చదరపు గజాలు, 2,420 చదరపు గజాల్లోని ప్లాట్ నెం 2, కుత్బుల్లాపూర్ చింతల్‌లోని 10,890 చదరపు గజాలు, 3,388 చదరపు గజాల భూములను వేలం ద్వారా విక్రయించనున్నారు.

# దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ

**హైదరాబాద్, మే 28:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ(ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను వారు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీని అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందన్నారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జూన్ 2 లేదా 3 తేదీల్లో నిర్వహించే అంశంపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఆ కార్యక్రమానికి ముందుగా పనుల పురోగతిని పరిశీలించేందుకు తాము వచ్చామన్నారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం ద్వారా నగర అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరుతుందని పేర్కొన్నారు. ఇక్కడ తీసుకునే ప్రతి నిర్ణయం, ప్రతి కార్యాచరణ గ్లోబల్ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా స్పష్టమైన దృక్పథంతో పనిచేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే పోలీస్ కమిషనరేట్ ఏర్పాటుతోపాటు గ్లోబల్ ప్రెజెన్స్ కలిగిన ప్రభుత్వ కార్యాలయాలను కూడా ఇక్కడినుంచే నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. స్కిల్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ పనులను తనిఖీ చేశారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్రంగా స్కిల్ యూనివర్సిటీ నిలవబోతోందని చెప్పారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి ఎదురైన ఆటుపోట్లు అధిగమిస్తూ సమస్యలను పరిష్కరిస్తూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రపంచంలోని అనేక దేశాలు, రాష్ట్రాలు సైతం ఆలోచించని విధంగా రాష్ట్ర అభివృద్ధి కోసం వినూత్న కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం తాత్కాలిక క్యాంపస్‌లో కొనసాగుతున్న యూనివర్సిటీకి శాశ్వత క్యాంపస్ నిర్మాణం వేగంగా జరుగుతోందని, పనుల పురోగతిని సమీక్షించి అవసరమైన నిర్ణయాలు తీసుకుని నిర్మాణాన్ని మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ కె.శశాంక, మహేశ్వరం డీసీపీ కె.నారాయణ రెడ్డి, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్ పూర్తి దశలో

- **ఐదేళ్లలో 200 ఇంటర్ సిటీ రైళ్ల తయారీ లక్ష్యం**
- **రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్**

**న్యూఢిల్లీ, మే28 :**

తెలంగాణలోని కాజీపేట రైళ్ల తయారీ యూనిట్ పనులు పూర్తి దశకు చేరుకున్నాయని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. త్వరలో అక్కడ ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభమవుతుందని తెలిపారు. కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌పై ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. రానున్న ఐదేళ్లలో ఈ యూనిట్‌లో 200 ఇంటర్ సిటీ రైళ్లను తయారు చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. ఇక్కడ తయారయ్యే రైళ్లను దేశవ్యాప్తంగా స్వల్ప దూర ప్రయాణాల కోసం వినియోగించనున్నట్లు చెప్పారు.



కొత్త ఇంటర్ సిటీ రైళ్లు ఆధునిక సౌకర్యాలతో రూపొందుతున్నాయని తెలిపారు. ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్ వ్యవస్థ, మెరుగైన వెంటిలేషన్ సదుపాయాలు ఇందులో ఉంటాయని చెప్పారు. ప్రతి రైలులో 20 కోచ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

ఈ రైళ్లు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా తయారు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రీజనరేటివ్ బ్రేకింగ్ సాంకేతికతను కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. రైలు బ్రేకులు వేసిన సమయంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌లోకి పంపే విధంగా ఈ సాంకేతికత పనిచేస్తుందని వివరించారు.

# సరికొత్త చరిత్ర... రాయదుర్గంలో ఎకరా రూ.237 కోట్లు!

- **జీఐఐసీ వేలంలో రికార్డు ధర పలికిన ధర**
- **పాన్ మక్తాలోని సర్వే నెంబర్‌లోని 6 ఎకరాల 29 గుంటలకు వేలం**
- **వేలంలో భూమిని దక్కించుకున్న గౌర వెంచర్స్**

**తెలంగాణ బ్యూరో, మే 28 :**

హైదరాబాద్ నగరంలో భూమి మరోసారి రికార్డు ధర పలికింది. టీజీఐఐసీ వేలంలో ఎకరా భూమి రూ.237 కోట్లు పలికి సరికొత్త రికార్డును సృష్టించింది. రాయదుర్గంలోని పాన్ మక్తాలోని సర్వే నెంబర్ 83/1లో 6 ఎకరాల 29 గుంటలకు వేలం వేశారు. ఈ క్రమంలో టీజీఐఐసీ భూముల వేలానికి అనూహ్య స్పందన లభించింది. ఈ వేలంలో భూమిని గౌర వెంచర్స్ దక్కించుకుంది. గత సంవత్సరం అక్టోబర్ నెలలో ఇదే ప్రాంతంలో ఎకరం ధర రూ.177 కోట్లు పలికిన విషయం తెలిసిందే. ఆరోజు 7 ఎకరాలకు రూ.1,357.59 కోట్లు వచ్చింది.

టీజీఐఐసీ వేలం వేసే భూములు మంచి డిమాండ్ ఉంటోంది. సర్వే నెంబర్ 83/1లోని ప్లాట్ 1ఏ, 1ఎఫ్‌లోని 6.29 ఎకరాలు, ప్లాట్ నెంబర్ పీ4లోని 5.09 ఎకరాలు సహా మొత్తం 11.38 ఎకరాల భూమి వేలానికి నోటిఫికేషన్ వచ్చింది. ఎకరాకు రూ.139 కోట్ల ధరను నిర్ధారించారు. ఈ వేలం ద్వారా రూ.2 వేల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని టీజీఐఐసీ అంచనా వేస్తోంది. ప్లాట్ నెంబర్ పీ4లోని భూములకు జూన్ 1న ఆన్ లైన్ లో వేలం నిర్వహించనున్నారు.

# జడ్చర్ల వద్ద అర్ధరాత్రి రెండు బస్సుల ఢీ

**మహబూబ్‌నగర్, మే 28:**

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సును బెంగుళూరు వైపు వెళ్తున్న మరో ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో 14 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని వెంటనే జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్‌కి తీవ్ర గాయాలు కావడంతో ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తిని తిరుపతి రిటైర్డ్ డీఎస్పీ సాంబశి వారెడ్డి కుమారుడు అశోక్ రెడ్డిగా గుర్తించారు. అశోక్ రెడ్డి మృతి వార్తతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ ప్రమాదానికి అధిక వేగం, డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదం కారణంగా కాసేపు జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా పోలీసులు వాహనాలను మళ్లించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

# రైతులారా అధైర్యపడకండి

- **ఇప్పటికే 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ.**
- **మద్దతు ధర ప్రకటించిన కేంద్రం చేతులు ఎత్తేసింది**
- **16,479 కోట్ల భారం రాష్ట్రంపై మోపింది**
- **ఎంతటి భారమైనా రైతులకు న్యాయం చేస్తాం**
- **ఇది రైతులు ఎన్నుకున్న ప్రభుత్వం**
- **ప్రజలను తప్పుదోవ పట్టించే యత్నాల మానుకోవాలి**
- **బీఆర్ఎస్ నేతలకు మంత్రి ఉత్తమ్ హితవు**

**హైదరాబాద్, మే 28:**

అండగా ఉంటాం.. రాష్ట్ర రైతాంగం అధైర్యపడొద్దని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో రైతుపక్షపాత ప్రభుత్వం ఏర్పడిందని, అటువంటి ప్రభుత్వం రైతాంగానికి వెన్నుదన్నుగా నిలుస్తోందని ఆయన స్పష్టం చేశారు. రబీ సీజన్ లో చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో ఎటువంటి అపోహలకు ఆస్కారమే లేదని ఆయన తేల్చిచెప్పారు. రబీ సీజ నో తుది దశకు చేరుకున్న ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై సహచర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులతో కలసి భోనగిరి యాదాద్రి,పెద్దపల్లి, వరంగల్ జిల్లాలో గురువారం పర్య టించారు. ఈ సందర్భంగా యాదాద్రి జిల్లాలోని వంగపల్లి గ్రామంలో దాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మంత్రుల బృందం ఆ తదుపరి సమీపంలోని రామాజిపేటలోని భారత ఆహార సంస్థకు చెందిన గోదాములో నిల్వ చేసిన ధాన్యాన్ని పరిశీలించింది.

అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఆయన ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం శ్రీనివాస రెడ్డి, వేముల వీరేశం, మందుల శ్యామ్యాల్, పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్.డి.సి.పి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్ లో మద్దతు ధర ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం కొనుగోలు ప్ర క్రియలో 52 లక్షల మెట్రిక్ టన్నులకే పరిమి తము అయ్యి చేతులు ఎత్తేసిందని ఆరోపించారు. దానితో రాష్ట్ర ప్రభుత్వం అదనంగా కొనుగోలు చేసిన 23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి గాను 16,479 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మీద కేంద్రం భారం మోపిందని ఆయన విమర్శిం చారు. ఎంతటి భారమైనా రైతుల గురుంచి మోసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. పారద ర్శకంగా దాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగు తుందని అయితే బీహార్, పశ్చిమ బెంగాల్ నుంచి వలస వచ్చిన కార్మికులు అక్కడ జరు గుతున్న ఎన్నికల్లో పాల్గొనేందుకు వెళ్లి తిరిగి రావడంలో ఒకింత ఇబ్బంది ఏర్పడిందని మిగితా వన్నీ సజావుగానే కొనసాగుతున్నాయన్నారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే మిగిలిన 28 రాష్ట్రలలో లేని విదంగా రికార్డ్ స్థాయిలో 8575 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రోజునుండి పంట పంటకు రికార్డ్ స్థాయిలో ధాన్యం దిగుబడి రావడమే కాకుండా అంతే రికార్డ్ స్థాయిలో కొనుగోలు చేయ డం దేశ చరిత్రలోనే సరికొత్త రికార్డ్ సృ ష్టించిందని ఆయన పేర్కొన్నారు. ఈ రబీ సీజ న్ లో ఇప్పటికే 58 లక్షల మెట్రిక్ టన్నుల ధా న్యాన్ని కొనుగోలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం మరో 17 లక్షలు కలిపి మొత్తం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభు త్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టంగా ప్రకటించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నేరుగా 11,000 వేల కోట్లు జమ చేసిందని ఆయన తెలిపారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో పాటు కేంద్రం పెట్టిన టార్గెట్ ను ఇప్పటి వరకు ఏ ఒక్కరూ చేరుకోలేదని మొట్ట మొదటిసారిగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం టార్గెట్ ను అధిగమించి రికార్డ్ స్థాయిలో కొనుగోలు జరుపుతున్నామని, ఇది రైతాంగం గమనించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం 52 లక్షల మెట్రిక్ టన్నులకే పరిమితమైతే అదే కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతోటే రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 23 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి 16,479 కోట్ల అదనపు భారాన్ని భరిస్తున్నదని ఆయన వివరించారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని సైతం రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసి సత్వరమే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కొనుగోళ్ల ప్రక్రియ తుదిదశకు చేరుకుందని అకాల వర్షాలతోపాటు, రుతుపవనాలు వచ్చే లోపు మిగిలిన ధాన్యాన్ని యుద్ధప్రాతిపదికన కొనుగోళ్ల పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించేందుకు వీలుగా ఇసుక రవాణా చేసే వాహనాలను, ఆయా ప్రాం తాలలో ఫ్యాక్టరీలు వినియోగించే వాహనాలను ధాన్యం తరలింపుకు మళ్లించాలని ఆయన సూచించారు.

**రైతులను తప్పుదారి పట్టించేలా బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలు**

రాజకీయ ప్రయోజనాలనాశించే బి.ఆర్.ఎస్. బిజెపిలు రైతాంగాన్ని తప్పు దోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. మద్దతు ధర ప్రకటించిన కేంద్రం ప్రభుత్వం కేంద్రం పెడుతున్న కొనుగోళ్ల టార్గెట్ ను పెంచేందుకు ఇక్కడి బిజెపి నేతలు కేం ద్రం మీద ఎందుకు వత్తిడి తేవడం లేదని సూటిగా ప్రశ్నించారు. ధాన్యం కొనుగోళ్ల అంశంపై బి.ఆర్.ఎస్ కు చిత్తశుద్ధి ఎంతమాత్రం లేదని వారి పదేళ్ల పాలనతో పోల్చి చూసినప్పుడు రికార్డ్ స్థాయిలో దిగుబడి, కొనుగోళ్ళు జరిగాయని తెలిపారు. ప్రజల్లో గందరగోళం సృష్టించి రాజకీయ ప్రయోజనం పొందలన్నది బి.ఆర్.ఎస్ నేతల ఉద్దేశ్యంగా కనిపిస్తోందన్నారు. రైతులకు నిజానిజాలు ఏమిటో అన్నది బాగా తెలుసని ఇది రైతులు ఎన్నుకున్న ప్రభుత్వమని తప్పు దోవ పట్టిస్తే తప్పు దోవ పట్టడానికి రైతులు సిద్ధంగా లేరన్నారు. ఇప్పటికైనా ఆ తరహా ప్రయత్నాలు మానుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హితవు పలికారు.



# తమిళ రాజకీయాల్లో విజయ్ ఎత్తులు!

తమిళనాడు రాజకీయాలు రసవత్తర మలుపులు తిరుగుతున్నాయి. మద్దతుల ఇచ్చిన అన్నా డిఎంకె ఎమ్మెల్యేలు మళ్లీ పళనిస్వామి చెంతకు చేరారు. మేమంతా మీ వెంటే అని ప్రకటించారు. ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం మనలేదని డిఎంకె నేత స్టాలిన్ ఇప్పటికే శాపనార్థాలు పెట్టారు. ఈ స్థితిలో కాంగ్రెస, లెఫ్, ముస్లిం పార్టీల మద్దతు బొటాబొటిగా ఉంది. దీంతో మరో ఐదేళ్లపాటు లాక్కురావడం అంత సులభం కాదు. ఎందుకంటే ఐదారు సీట్ల మద్దతుతో వారి గొంతెమ్మ కోర్కెలు తీర్చడం సిఎం విజయ్‌కు తలనొప్పిగా పరిణమించవచ్చు. ఈ క్రమంలో సొంతగా బలం కోసం టివికె అధినేత, సిఎం కొత్త ఎత్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ద్రవిడ పార్టీలకు చెక్ పెట్టడంతో పాటు తమిళనాట పాతుకు పోయేందుకు రాజకీయంగా ఎత్తులు వేస్తున్నట్లు పరిస్థితులు తెలియచేస్తున్నాయి. చిల్లర పార్టీలతో కలిసి నడిచేకంటే సొంతగా బలం సమకూర్చుకోవడం ఉత్తమమని ఆయన భావనలో ఉన్నారు. అందుకే ఇటీవల అన్నాడిఎంకెకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి విజయ్ పంచన చేరారు. వారు ఉప ఎన్నికల్లో టివికె పార్టీ పక్షాన గెలిస్తే సొంతబలం పెరగవచ్చు. ఇలా సొంత బలం కోసం అవసరమైన ఇతర పార్టీల్లోని ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి గెలిపించుకోవాలన్న ఎత్తుగడలో సిఎం విజయ ఉన్నట్లు సమాచారం. ఓవైపు ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో అభిమానం పెంచుకోవడంతో పాటు, పార్టీ బలాన్ని పెంచుకునేలా టివికె చీఫ్ ఎత్తుడగులు సాగుతున్నాయి. అధికారంలో ఉంది మన ప్రభుత్వమే అని డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్ పార్టీ కార్యకర్తలతో అన్నట్లు విస్తృత ప్రచారంలో ఉంది. మరో సందర్భంలో విజయ్ ప్రభుత్వం కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని ఆయనే వెల్లడించారు. ఈ మాటల్ని అనుసరించి.. టీవీకే ప్రభుత్వాన్ని తాను నియంత్రించేస్థాయిలో ఉన్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది టీవీకేకు మింగుడు పడటంలేదు. మరోవైపు అన్నాడీఎంకే చీలికల కారణంగా మద్దతుగా నిలిచిన 25 మందిలో కొందరు మంత్రి పదవుల్ని ఆశించినట్లు ప్రచారంలో ఉంది. మంత్రివర్గ విస్తరణలో వారికెలాంటి స్థానం లేకపోవడం, కాంగ్రెస్ లో ఇద్దరికి దక్కడంతో పాటు డీఎంకే కూటమిలోని ఐయూఎంఎల్, వీసీకేకు చెరొక మంత్రిపదవి ఇవ్వడంతో అన్నాడీఎంకే చీలిక శ్రేణులు అసంతృప్తిగా ఉన్నట్లు తేలింది. డీఎంకే అధిపత్యం తగ్గించే వ్యూహంలో.. అన్నాడీఎంకే చీలిక ఎమ్మెల్యేలు తమవైపు ఉండటాన్ని లాభంగా మలచుకోవాలని టీవీకే చూస్తోంది. తమ పార్టీలోకి రావాలంటే రాజీనామాలు చేయాలనే షరతు విధించినట్లు విశ్వసనీయంగా చెబుతున్నారు. ఇందులో భాగంగానే నలుగురు రాజీనామా చేసి టీవీకేలో చేరారు. రాజీనామాలు చేసేందుకు మరికొందరు అన్నాడీఎంకే చీలికవర్గం ఎమ్మెల్యేలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. టీవీకేకు అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ రాకపోవడంతో.. ఆ పార్టీకి మద్దతిచ్చే పక్రియలో రెండు ప్రధాన కూటములు ఎవరి ఆట వారు ఆడుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు విజయ్ కొత్త ఆట మొదలుపెట్టారు. పలువురు ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి విజిల్ గుర్తుపై బరిలోకి పంపి.. వారిని గెలిపించి.. ఇతర పార్టీల మద్దతు లేని సొంత ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీలో జరిగిన బల ప్రదర్శనలో టీవీకే ప్రభుత్వం అనూహ్య మద్దతు కూడగట్టుకుంది. ఏకంగా 144 ఎమ్మెల్యేల బలాన్ని అందుకుంది. ఈ సంఖ్యలోనే అనేక వ్యూహాలు కనిపిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టీవీకేపై ఆధిపత్యం కోసం ఇటు డీఎంకే కూటమి, అటు అన్నాడీఎంకే ఓ వర్గం అంతర్గత వ్యూహాల్ని రచించినట్లు తెలుస్తోందంటున్నారు. అంతర్గత నిర్ణయాల కారణంగా తమ కూటమిలోని వీసీకే, ఐయూఎంఎల్, సీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన 8 సీట్లను టీవీకే మద్దతుగా ఇచ్చారు. మరోవైపు టీవీకేతో జట్టుకట్టిన కాంగ్రెస్‌కు 5 సీట్లు, ఏఎంఎంకే నుంచి బయటికి వచ్చి స్వతంత్ర అభ్యర్థిగా మద్దతిచ్చిన కామరాజ్ ఓటు కలిపి.. టీవీకేకు 119 సీట్ల వచ్చింది. కోర్టు ఆంక్షలతో తిరపత్తూర్ ఎమ్మెల్యే ఓటింగ్‌కు పాల్గొనలేదు, తిరుచ్చి తూర్పుస్థానం ఖాళీగా ఉండటం, స్పీకర్ ఓటు లెక్కలోకి లేకపోవడంతో టీవీకే బలం 105గా ఉంది. ఇతరుల మద్దతుతో ఓటింగ్‌కు ముందే మ్యాజిక్ ఫిగర్ దాటినట్లు అంచనాలు వచ్చాయి. ఇక అసెంబ్లీలో ఓటింగ్ జరుగుతున్న క్రమంలో అన్నాడీఎంకే చీలికవర్గం నుంచి అనూహ్యంగా మరో 25 ఓట్లు దక్కాయి. దీంతో బలం 144కు చేరింది. రెండు కూటముల నుంచి టీవీకేకు బలం అందడంతో వచ్చే 6నెలలదాకా ప్రభుత్వం కూలడానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిన్లటైంది. మద్దతు పార్టీల సంగతి అటుంచితే.. ఇప్పటికిప్పుడు టీవీకే నెమ్మదిగా బలపడుతోంది. సొంతంగా 107 స్థానాలు దగ్గరున్నాయి. 5 కాంగ్రెస్, ఒక స్వతంత్రతో పాటు ప్రస్తుతం ఖాళీగా ఉన్న 5 అసెంబ్లీ స్థానాల్లో గెలిస్తే.. 118 స్థానాల బలమొస్తుంది. అన్నాడీఎంకే చీలిక వర్గంలోని మరికొందరు రాజీనామాలకు సిద్ధపడి టీవీకే గుర్తుపై పోటీ చేసే అవకాశమొస్తే మ్యాజిక్ ఫిగర్ 118ని దాటి స్థిరమైన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకుల్లో చర్చ సాగుతోంది. తిరుచ్చి ఈస్ట్‌లో విజయ్‌కు 91,381 ఓట్లు వచ్చాయి. ఈయన డీఎంకేపై 27,416 ఓట్లతో గెలిచారు. ఇక్కడ అన్నాడీఎంకే చీలికవర్గ బలం తోడైతే అవలీలగా లక్ష ఓట్లు దాటొచ్చనేది అంచనా. రాజీనామాలు చేసిన స్థానాల్లో.. చెంగల్పట్టు జిల్లా మదురాంతకం(ఎస్సీ), తిరునెల్వేలి జిల్లా అంబాసముద్రం కలుపుకుని ఇప్పుడు తొలి 3 స్థానాల పార్టీలు టీవీకేవైపు ఉండటంతో ఇక్కడ లక్షన్నర ఓట్లకు తగ్గని బలముంది. 4 రాజీనామా స్థానాల్లో తిరిగి టీవీకే అభ్యర్థి గెలిచే అవకాశాలు సమృద్ధిగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇలా మరిన్ని స్థానాలు విజయ్‌కి తోడై అవలీలగా, ఒంటరిగా టీవీకే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, తద్వారా డీఎంకే ప్రభావాన్ని లేకుండా చేయడంతో పాటు స్వేచ్ఛగా పాలన అందించే దిశగా అడుగులు వేసే అవకాశాన్ని టీవీకే పరిశీలిస్తోంది. ఈ సమీకరణాలతో విజయ్ రాష్ట్రంలో మరింత బలపడాలని చూస్తున్నారు. అదే జరిగితే ద్రవిడ పార్టీలకు మనుగడ కష్టమే.

# ఎట్టకేలకు సిద్ధరామయ్య రాజీనామా

- గవర్నర్ కార్యదర్శికి రాజీనామా లేఖ అందచేత
- అధిష్టానం ఆదేశాల మేరకు వైదొలుగుతున్నట్లు ప్రకటన
- జాతీయ రాజకీయాలకు వెళ్లే ఆలోచన లేదని వెల్లడి



**బెంగళూరు:** కర్నాటకానికి తెరపడింది. గతకొంతకాలంగా ఊహాగానాలతో సాగిన రాజకీయాలు మలుపు తిరిగాయి. కర్నాటకలో సిద్దరామయ్య జమానా ముగిసింది. ఎట్టకేలకు కర్ణాటకలో నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేశారు. గురువారం మధ్యాహ్నం డీకే శివకుమార్‌తో కలిసి ఆయన లోక్‌భవన్‌కు వెళ్లారు. అయితే, ఆ సమయంలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యదర్శికి సిద్ధరామయ్య తన రాజీనామా లేఖను సమర్పించారు. ఈ విషయాన్ని గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి సైతం ధ్రువీకరించారు. సీఎం రాజీనామా లేఖను తీసుకున్నామని, గవర్నర్ తిరిగొచ్చాక దీనిపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. గహ్లోత్ ఈ సాయంత్రం బెంగళూరు చేరుకోనున్నారు. అనంతరం మంత్రులు డీకే శివకుమార్, పరమేశ్వరతో కలిసి సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడారు. అధిష్ఠానం సూచనలతో సీఎం పదవికి రాజీనామా చేశా. హైకమాండ్ ఆదేశాలకు అందరం కట్టుబడి ఉంటాం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే వైదొలిగా. నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశా. దాన్ని గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం ఉంది. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉంది. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. ఇప్పటివరకు ప్రభుత్వ నిర్వహణలో నాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. సీఎంగా నాకు అవకాశమిచ్చిన సోనియా, రాహుల్, ఖర్గేకు కృతజ్ఞతలు. 7 కోట్ల మంది కర్ణాటక ప్రజలకు సేవ చేసే అవకాశం లభించింది. రాజ్యాంగమే మా ధర్మం. ప్రజలే మాకు దేవుళ్లు అని సిద్ధరామయ్య తెలిపారు. జాతీయ రాజకీయాల్లోకి రావాలని హైకమాండ్ అడిగింది. రాజ్యసభ సీటు ఆఫర్ చేసింది. కానీ, నేను సున్నితంగా తిరస్కరించా. జాతీయ స్థాయి రాజకీయాలపై నాకు ఆసక్తి లేదు. అయితే, రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదు. ప్రజలు నన్ను 5 ఏళ్ల కాలానికి ఎన్నుకున్నారు. ఇంకా రెండేళ్లు మిగిలి ఉన్నాయి. అప్పటివరకు ఎమ్మెల్యేగానే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని, పదవీకాలాన్ని గుర్తుచేసుకుంటూ సిద్ధరామయ్య ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. నేను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చా. మా కుటుంబంలో అంతకుముందు ఎవరూ రాజకీయాల్లో లేరు. 2006లో కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి హైకమాండ్ నన్ను ఆదరించింది. సీఎం అవుతానని కలలో కూడా అనుకోలేదు. అలాంటిది ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా రెండేసిసార్లు సేవలందించాను. మ్యానిఫెస్టోలో ఇచ్చిన 160 హామీల్లో 158 నెరవేర్చా. మొదటి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీలు అమలు చేశాం. నాపై ప్రతిపక్షాలు వదంతులు ప్రచారం చేశాయి. కానీ, నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. పదవి కోసం, డబ్బు కోసం ఏనాడూ పాకులాడలేదని సిద్ధరామయ్య వివరించారు.

ఈ క్రమంలో అధిష్ఠానంతో భేటీకి సిద్ధరామయ్య దిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ కానున్నారు. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశానికి సంబంధించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. సిద్ధరామయ్య స్థానంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది. శనివారం జరిగే సీఎల్పీ సమావేశంలో కొత్త శాసనసభాపక్ష నేతను ఎన్నుకునే అవకాశం ఉంది. ప్రమాణస్వీకార కార్యక్రమంపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

# ఉక్రెయిన్‌తో ఎడతెగని రష్యా యుద్ధం

## భారీగా సైనిక సంపదను కోల్పోయిన రష్యా

## 5లక్షల మంది సైన్యం మరణించినట్లు వార్తలు

**మాస్కో:** రష్యా-ఉక్రెయిన్ మధ్య నాలుగేళ్లుగా కొనసాగుతోన్న యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో కొన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2022 నుంచి జరుగుతోన్న ఈ ఘర్షణల్లో రష్యాకు సైనిక పరంగా భారీ నష్టం వాటిల్లినట్లు కనిపిస్తోంది. ఈ పోరులో 5 లక్షల మంది మాస్కో సైనికులు ప్రాణాలు కోల్పోయారని బ్రిటన్ నిఘా వర్గాలు అంచనావేశాయి. మరోవైపు, యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచి తాము 55వేలమంది సైనికులను కోల్పోయినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ ఫిబ్రవరిలో వెల్లడించారు. ఇరువైపులా ప్రాణనష్టం భారీగానే ఉన్నా.. రెండు దేశాలు వాస్తవ లెక్కలను వెల్లడించట్లేదనే ఆరోపణలున్నాయి. గత నాలుగేళ్లుగా డాన్‌బాస్ ప్రాంతంలోని ఉక్రెయిన్ స్థావరాలపై దాడుల కోసం రష్యా తన సైనికులను దశలవారీగా మోహరించింది. కొత్తగా చేరిన సైనికులు, జైళ్ల నుంచి నియమించుకున్నవారు ఈ ఘర్షణల్లో పాల్గొన్నారు. వారికి సరైన శిక్షణ లేకపోవడం.. యుద్ధరంగంలో భారీగా ప్రాణనష్టానికి దారితీస్తున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు, అమెరికా, దాని మిత్రదేశాలు సరఫరా చేసే క్షిపణి వ్యవస్థలు, ఫిరంగి, అధునాతన డ్రోన్లను ఉక్రెయిన్ ఉపయోగిస్తోంది. కమాండ్ పోస్టులు, సైనిక సమూహాలు లక్ష్యంగా జెలెన్‌స్కీ సైన్యం దాడులు చేస్తోంది. దాంతో ఈ నష్టం మరింత పెరిగిందనే అంచనాలున్నాయి. ఈ దాడులను ఎదుర్కొనేలా రష్యా సుశిక్షితులైన సైనికులను నియమించుకోలేక పోతుందని, విధుల్లో ఉన్నవారిని కాపాడుకునేలా ఎలాంటి రక్షణకవచాలను సమీకరించలేకపోతుందని యూకే నిఘా వర్గాలు అంచనా వేశాయి. ఈ కారణాలే రష్యాను దెబ్బతీస్తున్నట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే.. ఆర్మీలో యువతను చేర్చుకునేందుకు రష్యా ప్రభుత్వం వారికి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా రక్షణశాఖతో ఒప్పందం కుదుర్చుకునే వారికి, వారి కుటుంబాలకు ఉండే రుణాల్లో 10 మిలియన్ రూబుల్స్ (సుమారు రూ.1.33కోట్లు) వరకు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. కొత్తగా సైన్యంలో చేరాలనుకునే వారు కనీసం ఏడాది పాటు కొనసాగుతానని హామీ ఇవ్వాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించిన నిర్ణయంపై అధ్యక్షుడు పుతిన్ సంతకం చేసినట్లు వార్తలు వచ్చాయి.

# పరస్పర సహకారంతో జల వివాదాల పరిష్కారం

## కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుపై మోడీ సమీక్ష



**న్యూఢిల్లీ:** అంతర్రాష్ట్ర జల వివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని రాష్ట్రాలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. సకాలంలో అనుమతులు, సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఈ సమస్యలను అధిగమించాలన్నారు. ఈ విషయంలో కెన్-బెట్వా ప్రాజెక్టు ఓ నమూనాగా నిలవాలని చెప్పారు. కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు సహా ఆయా రాష్ట్రాల్లో రూ.30 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులపై ప్రధాని సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యం.. ఖర్చుల పెరుగుదలకు దారితీయడమే కాకుండా, పౌరులకు అవసరమైన సౌకర్యాలను సకాలంలో అందకుండా చేస్తుందని మోదీ వ్యాఖ్యానించినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. నీటి భద్రత కోసం నదుల అనుసంధానం, జల సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవం వంటి అంశాల్లో అవకాశాలను గుర్తించాలని రాష్ట్రాలకు మోదీ సూచించారు. 'స్వచ్ఛభారత్ మిషన్- అర్బన్ 2.0'ను కూడా సమీక్షించారు. నగరాల్లో రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల వినియోగాన్ని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని చాటిచెప్పారు. కాల్వల వెంబడి, కాల్వలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మార్గాలనూ అన్వేషించాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన మౌలిక సదుపాయాలను కూడా వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు.

# పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్తతలు

## అమెరికా దాడులకు ప్రతీకార దాడులు

**టెహ్రాన్:** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓవైపు శాంతి ఒప్పందంపై చర్చలు కొనసాగుతుండగానే.. అమెరికా- ఇరాన్ మధ్య భీకర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. హర్మూజ్ సమీపంలో అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ క్షిపణులు ప్రయోగించింది. అగ్రరాజ్య సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేపట్టింది. హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా దళాలు దాడులు చేశాయి. ఇది జరిగిన కాసేపటికే బందర్ అబ్బాస్ పోర్టు వద్ద కూడా పలుమార్లు పేలుడు శబ్దాలు వినిపించాయి. ఈ దాడులను ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ దురాక్రమణ చర్యగా అభివర్ణించింది. అమెరికా పదే పదే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తుందని ఇరాన్ ఆరోపించింది. ఇలాంటి దురాక్రమణలు కొనసాగితే.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అంతేగాక, తాజా దాడులకు ప్రతీకారంగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా బేస్‌లను తాము లక్ష్యంగా చేసుకున్నట్లు ఐఆర్‌జీసీ తెలిపింది. కానీ, అది ఎక్కడి స్థావరం అనే విషయాన్ని వెల్లడించలేదు. అయితే తమ గగనతలంపైకి క్షిపణులు, డ్రోన్‌లు దూసుకొచ్చాయని కువైట్ దళాలు పేర్కొన్నాయి. వాటిని సమర్థవంతంగా అడ్డుకున్నట్లు వెల్లడించాయి.

# రైతుగా మారిన టెకీ.. పిడుగుపాటుకు హఠాన్మరణం



**బెంగళూరు:** సాఫ్ట్‌వేర్ జాబ్‌ను వదిలి వ్యవసాయ రంగంలోకి దిగిన ఒక వ్యక్తి పొలంలో పిడుగుపాటుకు గురై మరణించాడు. ఈ విషాద ఘటన బుధవారం కర్ణాటకలో చోటుచేసుకుంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం, మడికేరి టౌన్‌కు చెందిన రోషన్ బాలకృష్ణ ఇటీవలే సాఫ్ట్‌వేర్ జాబ్‌కు రాజీనామా చేసి వ్యవసాయ రంగంలోకి దిగారు. తన స్నేహితుడితో కలిసి పనిచేస్తున్నారు. వ్యవసాయ యంత్రాల మార్కెటింగ్ కూడా చేస్తున్నారు. ఈ క్రమంలో తన కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు నిర్ణయించిన ఆయన మైసూరులోని ఒక పొలాన్ని పరిశీలించేందుకు వెళ్లారు. ఆయన వెంట భార్య, కొడుకు కూడా వెళ్లారు. ఈ క్రమంలో పొలం సమీపంలోని చెట్టు నుంచి మామిడి పండును ఆయన కోసేందుకు ప్రయత్నిస్తుండగా పిడుగు పడింది. దీంతో, కుప్పకూలిన రోషన్ ఘటనా స్థలంలోనే మరణించారు. ఈ ఘటనలో మరో వ్యక్తి కూడా స్వలంగా గాయపడ్డారు. బాధిత కుటుంబానికి జిల్లా విపత్తు నిర్వహణ విభాగం రూ.5 లక్షల పరిహారాన్ని ప్రకటించింది. ఇందులో రూ.4 లక్షలు రాష్ట్ర విపత్తు నిర్వహణ నిధి నుంచి, మిగతా మొత్తం కేంద్ర ప్రభుత్వ నిధి నుంచి బాలకృష్ణ కుటుంబానికి అందజేయనున్నారు.

# ప్రధాని కార్యాలయ పర్యవేక్షణలో నీట్ టెస్ట్

## పకడ్బందీ చర్యలకు దిగిన కేంద్రం

**న్యూఢిల్లీ:** నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దాంతో మే 3న జరిగిన ప్రవేశపరీక్ష రద్దు కావడంతో.. జూన్ 21 రీటెస్ట్ నిర్వహించేందుకు కేంద్ర విద్యాశాఖ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి ఎలాంటి లోపాలు తలెత్తకుండా కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఈసారి రీటెస్ట్ పక్రియను ప్రధానమంత్రి కార్యాలయం నిశితంగా పరిశీలిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దిల్లీలోని తన నివాసంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీట్ రీటెస్ట్ (ఔఇఇ÷ు-జఉ స।బి।బబి)లో ఎలాంటి అవకతవకలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తాజాగా జరిగిన సమావేశంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా, ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, పీఎంఓ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పేపర్ తయారు చేయడం, ప్రింటింగ్, ట్రాన్స్‌పోర్టేషన్, పరీక్షా కేంద్రాలకు చేర్చడం వంటి ప్రతి పక్రియను ప్రధాన మంత్రి కార్యాలయం పర్యవేక్షించనుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ పరీక్షకు సంబంధించి ప్రతి అప్‌డేట్‌ను మోదీ తెలుసుకుంటున్నారని పేర్కొన్నాయి. ఈ రీటెస్ట్‌కు దేశవ్యాప్తంగా 23 లక్షల మంది హాజరుకానున్నారు.





# తెలంగాణలో గులాబీ పార్టీకి తిరుగులేదు

## రాగిడి లక్ష్మారెడ్డి

- మేడ్చల్ నియోజకవర్గం బోడుప్పల్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం
- ముఖ్య అతిథిగా హాజరైన మేడ్చల్ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డి, చామకూర మహేందర్ రెడ్డి
- డిల్లీ గులాంలకు.. హైదరాబాద్ గులాబీకి చాలా తేడా ఉంది
- మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు రోజులు దగ్గరపడ్డాయి
- కార్యకర్త జోలికొస్తే ఊరుకోం.. రాబోయేది మన ప్రభుత్వమే: 70 ఎం ఎం సినిమా చూపిస్తాం!
- బోడుప్పల్ బిఆర్ఎస్ సమావేశంలో మేడ్చల్ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డి



**బోడుప్పల్ రాజముద్ర న్యూస్:** మేడ్చల్ నియోజకవర్గం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్‌లో పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, చామకూర మహేందర్ రెడ్డి హాజరై, బూత్ కమిటీ సభ్యులకు నూతన డిజిటల్ సభ్యత్వ నమోదు, సర్ (ఓటర్ల జాబితా సవరణ) అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో అధికారం కోల్పోవడం తాత్కాలికమేనని, విపక్షంలో ఉండే ఈ సమయం పార్టీ అంతర్గత బలాన్ని పెంచుకోవడానికి ఒక గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. ఢిల్లీ కేంద్రంగా నడిచే కాంగ్రెస్, బీజేపీల కంటే.. తెలంగాణ ప్రయోజనాల కోసం హైదరాబాద్ నుంచే స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటూ పోరాడే ఏకైక శక్తి బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. గత పదేళ్ల BRS పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, 6 గ్యారెంటీలు, 420 హామీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సోషల్ మీడియా ద్వారా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే "సోషల్ మీడియా వారియర్స్" తయారు చేయడమే లక్ష్యమని తెలిపారు. యువతను ఆకర్షించేందుకు డిజిటల్ సభ్యత్వ నమోదు కీలకమని అన్నారు. బీఆర్ఎస్‌లో చేరే ప్రతి కార్యకర్తకు ఇది సాధారణ రాజకీయ పోరాటం కాదని, తెలంగాణ పునర్నిర్మాణంలో రెండో దశ ఉద్యమమనే భావన కల్పించాలని నాయకులు పిలుపునిచ్చారు. నాయకత్వం క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ మళ్లీ తన పూర్వ వైభవాన్ని చాటుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీబోడుప్పల్ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితుల్లో కార్యకర్తలకు ఆర్థిక భరోసా కంటే ఆత్మగౌరవ భరోసా, రాజకీయ రక్షణ చాలా ముఖ్యమని ఆయన ఉద్ఘాటించారు. కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతూ వేధిస్తున్న కాంగ్రెస్ నాయకులకు భవిష్యత్తులో 70 ఎం ఎం సినిమా చూపిస్తామని, రానున్న రోజుల్లో 'డీ అంటే డీ' అనే విధంగా తలపడతామని హెచ్చరించారు. బాధితులకు లీగల్ సెల్ ద్వారా తక్షణ ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, స్థానిక నేతలు ఎల్లప్పుడూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, పోచారం మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కాడే పోచయ్య, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభు, జావీద్ ఖాన్, ఆకుల మధుకర్, శ్యామల శ్రీను, బోడుప్పల్ నాయకులు కొత్త రవి గౌడ్, సామల సందీప్ రెడ్డి, కొత్త చక్రపాణి గౌడ్, కాటిపల్లి రామచంద్రారెడ్డి, బండారం శ్రీధర్ గౌడ్, రమేష్ యాదవ్, మీసాల కృష్ణ, అలీం, రవికుమార్, ప్రతాప్ రెడ్డి, రాజిరెడ్డి, బాలమల్లేష్, నాగేశ్వర్ గౌడ్, బొమ్మక్ విశ్వనాధం, రాసాల మహేష్ యాదవ్, ఉప్పరి విజయ్, కీర్తణ్, మాజీ ఎంపిటీసీ లు, నాయకులు, బూత్ కమిటీ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మారబోయిన రవి యాదవ్‌కు బేరి రామచందర్ యాదవ్ జన్మదిన శుభాకాంక్షలు



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ఇంచార్జ్, సీనియర్ నాయకులు మారబోయిన రవి యాదవ్ జన్మదినం సందర్భంగా బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ – "రవి యాదవ్ మునుముందు ఉన్నత పదవులు చేపట్టాలని మనస్ఫూర్తిగా భగవంతుణ్ణి కోరుకుంటున్నాను. యువతరం రాజకీయాల్లోకి వచ్చి మంచి పరిపాలన అందించాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, బహుజనులకు రాజ్యాధికార ఫలాలు అందాలి" అని అన్నారు."నేటి సమాజంలో యువత మంచి ఆలోచనతో, మంచి రాజకీయంతో పేద, మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాలకు సేవలు అందించాలి" అని యువతకు పిలుపునిచ్చారు.

**కార్యక్రమంలో పాల్గొన్నవారు**

నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రాయుడు, గోపి నగర్ బీసీ నాయకులు నరసింహ గౌడ్, వెంకటేష్ మేస్త్రి, సందీప్ యాదవ్, రాజు గౌడ్, మేదరి మహేంద్ర, సంఘం వెంకట్, గోపాల్ యాదవ్, రాజు యాదవ్, కిరణ్ ముదిరాజ్, శేరిలింగంపల్లి డివిజన్ ప్రజా ప్రతినిధులు, యువజన నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని మారబోయిన రవి యాదవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## నేలకొండపల్లిలో ఎన్టీఆర్ 103వ జయంతి ఘనంగా వేడుకలు

**పార్టీ జెండా ఆవిష్కరణ, ఎన్టీఆర్‌కు నివాళులు.. అన్నదాన కార్యక్రమం**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 103వ జయంతిని నేలకొండపల్లిలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. నేలకొండపల్లి టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు అక్కినేని నాగేశ్వరరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి మీసం శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ మద్దినేని మహేష్, పావులూరి వెంకటేశ్వరరావు, చౌదం ప్రవీణ్, తలసరి రాధాకృష్ణ, నూతకు ప్రసాద్, సూర్పనేని రామకృష్ణ, కొల్లి అన్నపూర్ణ, సుగుణమ్మ, సీతారాం బాబు, కొర్లకుంట కిరణ్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లిలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**చర్లపల్లి, రాజముద్ర న్యూస్:** బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు గత 1983 సంవత్సరంలో తెలుగుదేశం పార్టీనీ స్థాపించారని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా టిడిపి సీనియర్ నాయకులు చర్లపల్లి కంటెస్టెంట్ కార్పొరేటర్ రుద్రగోని రాంచందర్ గౌడ్ అన్నారు. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ శ్రీ శేషులు నందమూరి తారక రామారావు 103వ జయంతిని పురస్కరించుకుని చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి లో ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్. సత్యనారాయణ గౌడ్, కె. ప్రేమ గౌడ్, కె.కె రావు, రాగీరి నాథం, సత్యం యాదవ్, టి. బీరప్ప, ఎన్. అశోక్ గౌడ్, ఎస్. పరమేశ్ గౌడ్, ఆటోగిరి సంజీవ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యానికి గురవుతున్న చారిత్రక సంపద

## నేలకొండపల్లి బౌద్ధ స్థూపం



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** తెలంగాణలోని ఖమ్మం జిల్లా నేలకొండపల్లి ఒక ప్రాచీన బౌద్ధ క్షేత్రం. ఇక్ష్వాకుల కాలం నాటి ఈ బౌద్ధ స్థూపం 2,000 సంవత్సరాల చరిత్రకు సజీవ సాక్ష్యం. అయితే నేడు ఈ చారిత్రక సంపద నిర్లక్ష్యానికి, ఆక్రమణలకు, అవినీతికి బలైపోతోంది. 56 ఎకరాల స్థూప భూములు కబ్జా కావడం, తవ్వకాలు అశాస్త్రీయంగా జరగడం, భారీ నిధులు మంజూరైనా అభివృద్ధి శూన్యంగా ఉండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

**చారిత్రక నేపథ్యం**

క్రీ.శ. 3వ శతాబ్దంలో ఇక్ష్వాకుల పాలనలో నేలకొండపల్లి ఒక ప్రముఖ బౌద్ధ కేంద్రంగా విరాజిల్లింది. ఇక్కడ లభించిన శాసనాలు, స్థూపం, విహారాలు అంతర్జాతీయ బౌద్ధ పరిశోధకుల దృష్టిని ఆకర్షించాయి. కేంద్ర పురావస్తు శాఖ దీనిని "సంరక్షిత స్మారకం"గా గుర్తించింది. నిబంధనల ప్రకారం స్థూపానికి చెందిన 56 ఎకరాల భూమి పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉండాలి.

**ప్రస్తుత దుస్థితి - కబ్జాల మయం**

1.56 ఎకరాలు కబ్జా: స్థూపం చుట్టూ ఉన్న 56 ఎకరాల ప్రభుత్వ భూమిలో సగానికి పైగా ఆక్రమణకు గురైంది. కొందరు స్థానికులు వ్యవసాయం చేస్తున్నారు, మరి కొందరు ప్లాట్లుగా మార్చి అమ్మకాలు సాగిస్తున్నారు. సర్వే రాళ్లు పీకేసి, సరిహద్దులు చెరిపేశారు.

2. అధికారుల నిర్లక్ష్యం: పురావస్తు శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు కళ్లెదుటే ఆక్రమణలు జరుగుతున్నా చోద్యం చూస్తున్నారు. ఫిర్యాదులు చేసినా "విచారణ చేస్తున్నాం" అనే మాటలతో కాలం గడుపుతున్నారు తప్ప చర్యలు లేవు. అధికారులు అక్కడే ఉండి ఏం చేస్తున్నారనే ప్రశ్న స్థానికుల నుంచి వస్తోంది.

**గతంలో ఫిర్యాదు**

**- సర్వే జరిగినా ఫలితం శూన్యం:**

గతంలో సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ కబ్జా అయిన బౌద్ధ స్థూప భూములపై విచారణ చేసి స్వాధీనం చేసుకోవాలని ఫిర్యాదు చేయడంతో అధికారులు సర్వే నిర్వహించారు. ఆ సర్వేలో సుమారు 53 ఎకరాలను గుర్తించి సరిహద్దు రాళ్లు కూడా పాతారు. "చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి భూములు కాపాడతాం" అని అధికారులు ప్రకటనలు చేశారు. కానీ ఆ ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి. క్షేత్ర స్థాయిలో ప్రహరీ గోడ ఊసే లేదు. మళ్లీ కబ్జాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు.

**అశాస్త్రీయ తవ్వకాలు - చరిత్రకు చేటు:**

పురావస్తు శాఖ చేపట్టిన తవ్వకాలు నిపుణుల పర్యవేక్షణ లేకుండా, శాస్త్రీయ పద్ధతులు పాటించకుండా జరుగుతున్నాయి. జేసీబీలతో తవ్వడంతో విలువైన శిల్పాలు, శాసనాలు ధ్వంసమయ్యే ప్రమాదం ఉంది. దొరికిన పురావస్తువుల భద్రతపైనా అనుమానాలు ఉన్నాయి. తవ్వకాల పేరుతో జరుగుతున్న ఈ "విధ్వంసం" ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు.

**నిధులు మాయం - అభివృద్ధి శూన్యం:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బౌద్ధ క్షేత్రాల అభివృద్ధికి కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నాయి. నేలకొండపల్లి స్థూపానికి కూడా గత ఐదేళ్లలో భారీగా నిధులు విడుదలైనట్లు సమాచారం. కానీ క్షేత్ర స్థాయిలో ఒక్క మౌలిక వసతి కూడా కనిపించదు. పర్యాటకులకు మరుగుదొడ్లు లేవు, తాగునీరు లేదు, వివరణ బోర్డులు లేవు, రోడ్డు సౌకర్యం లేదు. మరి ఆ నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి?

**పరిష్కార మార్గాలు - స్థానికుల డిమాండ్:**

1.భూ సర్వే & ప్రహరీ: వెంటనే డ్రోన్ సర్వే, టోటల్ స్టేషన్ సర్వే ద్వారా మొత్తం 56 ఎకరాల సరిహద్దులు నిర్ధారించి, కబ్జాలను తొలగించాలి. గతంలో హామీ ఇచ్చినట్లు చుట్టూ ప్రహరీ గోడ వెంటనే నిర్మించాలి.

2. ప్రత్యేక కమిటీ: పురావస్తు నిపుణులు, చరిత్రకారులు, స్థానికులతో కమిటీ వేసి తవ్వకాలను పర్యవేక్షించాలి.

3.నిధులపై శ్వేతపత్రం: గత ఐదేళ్లలో మంజూరైన నిధులు, ఖర్చు చేసిన వివరాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి.

4. మ్యూజియం ఏర్పాటు: సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ డిమాండ్ చేస్తున్నట్లు ఇక్కడే మ్యూజియం ఏర్పాటు చేయాలి. నేలకొండపల్లి నుంచి తరలిపోయిన శిల్పాలు, శాసనాలు, పురావస్తువులన్నింటినీ తిరిగి తెచ్చి ఈ మ్యూజియంలో ఉంచాలి. దీనివల్ల పర్యాటక అభివృద్ధి జరుగుతుంది. లైట్ అండ్ సౌండ్ షో, గైడ్ వ్యవస్థ ఏర్పాటు చేసి నేలకొండపల్లిని అంతర్జాతీయ బౌద్ధ సర్క్యూట్‌లో చేర్చాలి.

5. బాధ్యులపై చర్యలు: కబ్జాలకు సహకరించిన, నిధులు దుర్వినియోగం చేసిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. చరిత్రను కాపాడుకోలేని జాతికి భవిష్యత్తు ఉండదు. 2,000 ఏళ్ల చరిత్ర కలిగిన నేలకొండపల్లి బౌద్ధ స్థూపం నేడు కబ్జాదారుల, అవినీతి అధికారుల చేతిలో అన్యాయమైపోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి స్థూపం భూములను కాపాడాలి. లేకపోతే రేపటి తరానికి మనం చరిత్రను కాకుండా చరిత్ర లేని ఖాళీ ప్రదేశాన్ని మాత్రమే మిగులుస్తాం. ఇది కేవలం 56 ఎకరాల భూమి సమస్య కాదు. మన అస్తిత్వ సమస్య.

## నేలకొండపల్లిలో నిర్లక్ష్యపు డ్రైవింగ్.. కారును ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండల కేంద్రంలో నిర్లక్ష్యపు డ్రైవింగ్ మరోసారి ఇద్దరిని ఆసుపత్రి పాలు చేసింది. స్థానికంగా నివాసముండే ఒక వ్యాపారవేత్త అతివేగంగా, అజాగ్రత్తగా కారు నడపడంతో జరిగిన ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రంలో తన ఇంటి సమీపంలోని మలుపు వద్ద సదరు వ్యాపారవేత్త కారును ఒక్కసారిగా స్పీడ్‌గా ఇంట్లోకి మలుపు తిప్పారు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న బైక్‌ను గమనించలేదు. దీంతో వెనుక వస్తున్న బైక్ అదుపు తప్పి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టూ వీలర్ మీద ఉన్న ఇద్దరూ ఎగిరి రోడ్డుపై పడిపోయారు. బైక్ ముందు భాగం పూర్తిగా ధ్వంసం కాగా, దానిపై ప్రయాణిస్తున్న ఇద్దరికీ తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన కారు స్థానిక వ్యాపారవేత్తదిగా గుర్తించారు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి అత్యవసర విభాగంలో చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మండల కేంద్రంలో ఇళ్ల మధ్యలో, ఇరుకైన రోడ్లలో కూడా కొందరు అతివేగంగా వాహనాలు నడుపుతున్నారని, సైడ్ మిర్రర్ చూడకుండా, సిగ్నల్ ఇవ్వకుండా మలుపులు తిప్పుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు వెంటనే స్పందించి నిర్లక్ష్యంగా వాహనం నడిపిన వ్యాపారవేత్తపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ స్థానం శాశ్వతం

- కాప్రాలో ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు
- ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా, రాజముద్ర న్యూస్:** ఉప్పల్ నియోజకవర్గం పరిధి కాప్రా లోని హైటెన్షన్ రోడ్, బృందావన్ కాలనీలో మహానాయకుడు, స్వర్గీయ నందమూరి తారకరామారావు 103వ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. గురువారం కమ్మ సేవా సమితి,ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలతో పాటు ఘనంగా నివాళి – కేక్ కటింగ్ చేశారు. అనంతరం కాలనీలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కమ్మ సేవా సమితి సభ్యులు, అభిమానుల సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి హాజరై ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ స్థానం శాశ్వతమని, ఆయన సమాజానికి చేసిన సేవలు, ఆశయాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. హాజరైన ప్రముఖులు అండ్ కమ్మ సేవా సమితి సభ్యుల జాబితా,టీజీకే మూర్తి ,కొత్త రామారావు,సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి,కనుకుల రజనీకాంత్ రెడ్డి,ముప్పా రామారావు,బిల్డర్ దామోదర్, రజిక కుమారస్వామి,చల్లపల్లి నాగేశ్వరరావు,పత్తిబండ్ల నాగేశ్వరరావు,గద్దే సుబ్బయ్య,సత్యనారాయ, సుకుమార్,హనుమ,జి.భవాని,మాల్యాద్రి,పవన్ పరుచూరి,చల్లపల్లి నాగార్జున తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా స్థానిక కాలనీఎన్టీఆర్ అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమం పై బిజెపి కార్యకర్తలతో సమావేశం



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** గ్రామ గ్రామాన,వాడ,వాడలా బిజెపి పార్టీని బలోపేతం చేయాలని నేలకొండపల్లి బిజెపి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అన్నారు.మండల స్థాయి బిజెపి బిఎల్ఓ టు సమావేశం గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే జూన్ నెలలో జరగబోయే సర్ కార్యక్రమం పై కార్యకర్తలు అవగాహన కలిగి ప్రజలను సమన్వయం చేయాలని కోరారు.ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు,బిఎల్ఓ 1 నకిరికంటి వీరభద్రం మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జరుగనున్న ఓటర్ల సవరణను,మన నియోజకవర్గంలో కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మాలేబోయి గోవిందరావు,బిజెపి అధికార ప్రతినిధి సూరేపల్లి జ్ఞానరత్నం, యువ మోర్చా మండల అధ్యక్షు కార్యదర్శిలు తంగేళ్ల సతీష్,జెల్లా సురేష్,గిరిజన మోర్చా నాయకులు తేజావత్ నాగరాజు,నాయకులు ఎలిగేటి గిరి,పిట్టల సూరిబాబు,దివాకర్,వేణుబాబు,ఎలిగేటి వెంకటేష్,మూడు రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు

- తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత ఎన్టీఆర్
- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కాప్రా, రాజముద్ర న్యూస్:** స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 103వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని హౌసింగ్ బోర్డు డివిజన్ పరిధిలోని ఆయన విగ్రహానికి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత ఎన్టీఆర్ రాజకీయాల్లోనే కాకుండా సినీరంగంలో కూడా చెరగని ముద్ర వేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. తెలుగు జాతి గర్వించదగ్గ మహానుభావుడైన ఎన్టీఆర్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే గారు పిలుపునిచ్చారు. సమాజ సేవ, ప్రజా సంక్షేమం పట్ల ఆయన చూపిన నిబద్ధత ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఏవి న్యూస్ ఛానల్ కార్యాలయంపై దాడి

- దొంగతనం దాడి ధ్వంసం కేసులో ఆకుల ప్రభాకర్, ఆకుల నరేష్ అలుగూరి గిరిబాబు పై ఎఫ్ఐఆర్ నమోదు..
- ఏవీ న్యూస్ ఛానల్, తాళాలు పగలగొట్టి రూ. 25 లక్షల విలువ చేసే ఎలక్ట్రానిక్ పరికరాల చోరీ..
- అర్ధరాత్రి తాళాలు, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, డివిఆర్ ను ఎత్తుకెళ్లిన దుండగులు..
- దుండగులు ఆకుల ప్రభాకర్, ఆకుల నరేష్, గిరిబాబులను అదుపులోకి తీసుకున్న పోలీసులు..




**జవహర్ నగర్, రాజముద్ర న్యూస్:** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దమ్మాయిగూడ లో ఏవి న్యూస్ ఛానల్, నేటితరం దినపత్రిక కార్యాలయంలోకి, అర్ధరాత్రి అక్రమంగా ప్రవేశించి కార్యాలయం తాళాలు పగల కొట్టి, ఛానల్ కార్యాలయంలోని దాదాపు 25 లక్షల రూపాయల విలువచేసే ఐదు విలువైన కంప్యూటర్స్, మూడు సోనీ కెమెరాలు, రెండు కలర్ ప్రింటర్స్,(55 ఇంచుల) ఎల్ఈడి టీవీ, ఓవెన్ తో పాటు, విలువైన ఎలక్ట్రిక్ పరికరాలు 15వేల రూపాయల నగదు ను చోరీ చేసి, న్యూస్ ఛానల్ ను ధ్వంసం చేసిన, దొంగల ముఠాను, (ఏ 1), అలుగురి గిరిబాబు, కోదాడ నివాసి, ఆకుల ప్రభాకర్ గౌడ్, జవహర్ నగర్ (కాప్రా) మేడ్చల్ జిల్లా నివాసి, ఆకుల నరేష్ గౌడ్, తండ్రి ఆకుల ప్రభాకర్ గౌడ్, జవహర్ నగర్ (కాప్రా) మేడ్చల్ జిల్లా నివాసులను జవహర్ నగర్ పోలీసులు , అదుపులోకి తీసుకొని ఎఫ్ఐఆర్ నెంబర్:734/2026, సెక్షన్ 329(4),324(4),303(2),351(2)352,79, ఆర్ /డబ్ల్యు,3(5) బీఎన్ ఎస్ కేసు నమోదు చేసుకొని, నిందితులను రిమాండ్ చర్లపల్లి జైలుకు తరలించిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు బి ప్రవల్లిక, (న్యూస్ చానల్ సీఈవో) తెలిపిన వివరాల ప్రకారం. జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని, వెంకటరమణ కాలనీలో, గత మూడు సంవత్సరాలుగా, నిర్వహణ కొనసాగుతున్న ఏవి న్యూస్ ఛానల్ పై తేదీ 23.5. 2026, అర్ధరాత్రి, ఆకుల ప్రభాకర్, అతని కుమారుడు ఆకుల నరేష్, (జవహర్ నగర్ నివాసులు) అతని స్నేహితుడు అలుగూరి గిరిబాబులు, అనుచరులు 10 మంది కలిసి ఓ ముఠాగా, ఏర్పడి, పలు చోరీలకు కిడ్నాప్ లకు పాల్పడినట్లు పోలీసులు తేల్చేశారు గతంలో గిరిబాబు అతని అనుచరులపై కిడ్నాప్ 420 చోరీల కేసులు నమోదైనట్లు పోలీస్ రికార్డుల్లో నమోదయ్యాయి.. తేదీ: మే 22, తేదీ సాయంత్రం 5 గంటలకు న్యూస్ ఛానల్, కార్యాలయానికి తాళాలు వేసి, ఇంటికి వెళ్లగా అర్ధరాత్రి, ఆకుల ప్రభాకర్ ఆకుల నరేష్, అలుగూరి గిరిబాబు, వీరి అనుచర వర్గం దాదాపు పదిమందికి పైగా, ఛానల్ కార్యాలయంలోని సీసీ కెమెరాలు వైర్లను, తొలగించి ప్రధాన గేటు తాళాన్ని పగలకొట్టి, కార్యాలయం లోపలికి అక్రమంగా ప్రవేశించి ప్రధాన ద్వారం దర్వాజాతో పాటు, ఫస్ట్ ఫ్లోర్, సెకండ్ ఫ్లోర్, దర్వాజల తాళాలు పగలగొట్టి, అందులో ఉన్న , ఐదు విలువైన కంప్యూటర్స్,మూడు హెచ్ డీ సోనీ కెమెరాలు, ఎల్ఈడి (55)టీవీ, ఓవిన్, సీసీ కెమెరాల డివిఆర్ బాక్స్, తో పాటు 15 వేల రూపాయల నగదు విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలను, చోరీ చేసి కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. 23వ తేదీ మధ్యాహ్నం ఆఫీస్ కార్యాలయానికి విచ్చేయగా, ప్రధాన గేటు తాళంతోపాటు, రెండు దర్వాజల తాళాలు, 12 సీసీ కెమెరాలు వైర్లను కట్ చేసి, ఆఫీస్ కార్యాలయంలోని, 25 లక్షల విలువ చేసే ఎలక్ట్రానిక్స్ పరికరాలను దొంగిలించారు. దీంతో వెంటనే ఛానల్ ఓనర్ 100 నెంబర్ కు డయల్ చేయగా జవహర్ నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి విచ్చేశారు. న్యూస్ ఛానల్ సీఈఓ బొమ్మ ప్రవల్లిక జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో, 23వ తేదీ రాత్రి 9 గంటల పది నిమిషాలకు జవహర్ నగర్ ఇన్స్పెక్టర్ ఎస్. సైదులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి విచ్చేసిన సబ్ ఇన్స్పెక్టర్ ఎండి ఇద్రిస్ అలీ, దొంగతనం జరిగిన సంఘటనను పంచనామా చేసి, నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

# నేలకొండపల్లి బౌద్ధ స్థూపానికి అంతర్జాతీయ రూపురేఖలు!

**చారిత్రక క్షేత్రంలో వారసత్వ శాఖ ఉన్నత స్థాయి బృందం క్షేత్రస్థాయి పరిశీలన**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి,ఇక్ష్వాకుల కాలం నాటి చారిత్రక సంపద నేలకొండపల్లి బౌద్ధ మహాస్తూపాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తును వేగవంతం చేసింది. తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ క్షేత్రం అభివృద్ధి కోసం ఇప్పటికే రూ. 2.50 కోట్ల నిధులు మంజూరైన సంగతి తెలిసిందే. అయితే ఈ నిధులతో పాటు ఈ చారిత్రక క్షేత్రానికి అంతర్జాతీయ స్థాయి హంగులు అద్దేందుకు ఇంకా ఎంత వ్యయం అవుతుంది, ఎలాంటి పనులు చేపట్టాలనే అంశాలపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించిన నేపథ్యంలో గురువారం వారసత్వ శాఖ ఉన్నత స్థాయి బృందం ఇక్కడ క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది.

**డి.పి.ఆర్ రూపకల్పన కోసం ఉన్నత స్థాయి బృందం:**
తెలంగాణ వారసత్వ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాటి, బుద్ధవనం ప్రాజెక్ట్ మెంటార్ సి.ఆంజనేయ రెడ్డి నేతృత్వంలోని ఉన్నతాధికారులు, పురావస్తు నిపుణుల బృందం నేలకొండపల్లి బౌద్ధ స్తూపాన్ని విస్తృతంగా పరిశీలించింది. మంజూరైన రూ. 2.50 కోట్ల నిధుల వినియోగంతో పాటు, భవిష్యత్ నిధుల అంచనాలు, ల్యాండ్ స్కేపింగ్, పర్యాటక హంగుల రూపకల్పనపై నిపుణుల బృందం క్షేత్రస్థాయిలోనే సుదీర్ఘంగా సమీక్షించింది. స్థూపం చుట్టూ ఉన్న ప్రాంతాన్ని, ప్రస్తుత వసతులను, అభివృద్ధికి ఉన్న అవకాశాలను బృందం సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారు.

**ఎన్‌జీఆర్ఐ సహకారంతో భూగర్భ సర్వే:**
మాస్టర్ ప్లాన్‌లో భాగంగా, కేవలం ఉపరితల తవ్వకాలకే పరిమితం కాకుండా ఎన్‌జీఆర్ఐ సహకారంతో భూగర్భ జియోఫిజికల్ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. దీని ద్వారా భూగర్భంలో దాగివున్న చారిత్రక అవశేషాలను శాస్త్రీయంగా వెలికితీసి రక్షించనున్నారు. తవ్వకాలలో విలువైన సంపదకు నష్టం వాటిల్లకుండా ఈ ఆధునిక సాంకేతికత ఉపయోగపడనుంది. అలాగే, పర్యాటక వసతుల విస్తరణ కోసం సుమారు నాలుగు ఎకరాల భూమిని సేకరించాలని బృందం తీర్మానించింది.

**ఆధునిక పర్యాటక వసతులు:**
ఇక్కడ పర్యాటకుల కోసం చరిత్రను ప్రతిబింబించే త్రీడీ ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్, ఆడియో–విజువల్ గ్యాలరీలు, ఓపెన్ ఎయిర్ అంఫీ థియేటర్, అంతర్జాతీయ స్థాయి వాకింగ్ మార్గాలు, ఆధునిక లైటింగ్ వంటి మౌలిక వసతులను ఈ నివేదికలో చేర్చనున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు, పూర్తి వ్యయ అంచనాలతో కూడిన ఈ 'సమగ్ర నివేదిక'ను రాబోయే రెండు నెలల్లో ప్రభుత్వానికి సమర్పిస్తామని వారసత్వ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాటి వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నేలకొండపల్లి అంతర్జాతీయ బౌద్ధ సర్క్యూట్‌లో ప్రముఖ స్థానాన్ని పొందుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏపీఓకి చుట్టంగా... గ్రామీణ ఉపాధి హామీ చట్టం!

**కుటుంబ సభ్యుల పేరుతో ప్రైవేట్ వ్యాపారం.. కార్యాలయంలోనే డీల్స్.. లక్షల ప్రజాధనం దుర్వినియోగం**

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** పాలేరు, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీలు చదివిన నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాలు లేక ప్రైవేట్ ఉద్యోగాలతో కాలం వెళ్లదీస్తుంటే, ప్రభుత్వ ఒప్పంద ఉద్యోగం చేస్తూనే కొందరు ఉద్యోగులు అదనపు ఆదాయం కోసం ప్రైవేటు వ్యాపారాలను నిర్వహిస్తూ ప్రభుత్వానికే కుచ్చుటోపీ పెడుతున్నారు. నేలకొండపల్లి మండల మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) అడిషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్ (ఏపీఓ) ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కుటుంబ సభ్యుల పేరుతో ఇన్సూరెన్స్‌తో పాటుగా కమీషన్ వచ్చే ఇతరత్రా వ్యాపారాలు చేస్తూ ఉపాధి హామీ పథకం లక్ష్యాన్ని నీరుగార్చుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**విధులు గాలికి, వ్యాపారం వైపే ధ్యాస:**
గత కొన్ని సంవత్సరాలుగా విధులకు హాజరు కావడమే తరువాయి, నిత్యం ప్రైవేట్ వ్యాపారాలను ఎలా విస్తరించుకోవాలనే ధ్యాసే తప్ప ప్రజలకు ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి చేకూర్చిందేమీ లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. విధుల్లో ఉదాసీన వైఖరిని అవలంభించడంతో క్షేత్రస్థాయిలో జరగవలసిన ఉపాధి హామీ పనుల్లో పురోగతి లేక "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్న చందంగా ఉంది. ఒప్పంద ఉద్యోగం అయినప్పటికీ నెల నెలా ప్రభుత్వం నుండి ఐదంకెల జీతం తీసుకుంటున్న ఏపీఓ, ప్రైవేట్ వ్యాపారం మోజులో నిమగ్నం కావడంతో ప్రతిష్టాత్మకమైన జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం ప్రజలకు అక్కరకు రాకుండా అభాసుపాలవుతోంది.




**కాలు కదలదు.. పని ముందుకు సాగదు:**
నేలకొండపల్లి ఏపీఓ వ్యాపార కార్యకలాపాలు చూస్తే ఔరా అనాల్సిందే. ఎవరికీ అనుమానం రాకుండానే ఎంచక్కా తన వ్యాపారాన్ని చెక్కబెట్టుకుంటున్నారు. సొంతంగా నిర్వహించే, లాభాలు వచ్చే ఇన్సూరెన్స్, వ్యాపార లావాదేవీల నిర్వహణకు కాళ్లు అరిగేలా తిరిగే ఏపీఓ, ఉపాధి హామీ పథకం పనుల పర్యవేక్షణ అంటే మాత్రం చిన్నచూపే. కార్యాలయం నుంచి కాలు కదపకుండా, గ్రామాల్లో జరుగుతున్న, జరిగిన పనులను క్షేత్రస్థాయిలో సందర్శించకుండానే లేనిది ఉన్నట్లుగా ఉన్నతాధికారులకు నివేదిస్తూ బురిడి కొట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన లక్షల రూపాయల ప్రజాధనం ప్రజలకు, రైతులకు ఉపయోగపడకుండానే బూడిదలో పోసిన పన్నీరులా మారుతోంది.

**కార్యాలయంలోనే డీల్స్:**
ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్యాలయంలోనే ప్రైవేట్ వ్యాపార డీల్స్ నడుపుతున్నారని, బినామీ పేర్లతో ఆర్థిక లావాదేవీలు జరుపుతున్నారని విమర్శలు వస్తున్నాయి. గ్రామీణాభివృద్ధి సంస్థ లక్ష్యాలను సాధించేలా కృషి చేయాల్సిన ఏపీఓ విధుల్లో ఉదాసీనంగా ఉంటూ, బాధ్యతలను విస్మరించి బినామీ పేర్లతో చేస్తున్న వ్యాపార లావాదేవీల కుంభకోణంపై ఉన్నతాధికారులు విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు. బినామీ పేర్లతో చేస్తున్న వ్యాపార లావాదేవీల కుంభకోణంపై రేపు మరో కథనం..

## బిజినెస్

### సగానికి తగ్గిన వెంచర్ ఇన్వెస్ట్‌మెంట్స్




వెంచర్ క్యాపిటల్, ప్రయివేట్ ఈక్విటీ(పీఈ) ఫండ్స్ పెట్టుబడులు గత నెలలో సగానికి క్షీణించాయి. వెరసి ఏప్రిల్‌లో 38 డీల్స్ ద్వారా 2.7 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ప్రధానంగా డాలరుతో మారకంలో రూపాయి క్షీణత, రాజకీయ భౌగోళిక ఆందోళనలు దెబ్బతీశాయి. ఐవీసీఏ, కన్సల్టెన్సీ సంస్థ ఈవై విడుదల చేసిన నివేదిక ప్రకారం 2025 ఏప్రిల్‌తో పోలిస్తే విలువలో 50 శాతం తగ్గాయి. 2026 ఏప్రిల్‌లో 83 లావాదేవీలు నమోదయ్యాయి. ఇవి 29 నెలల కనిష్టంకాగా.. గతేడాది ఏప్రిల్‌లో 134, ఈ ఏడాది మార్చిలో 131 ట్రాన్సాక్షన్స్ జరిగాయి. డాలరుతో మారకంలో రూపాయి 96 స్థాయికి పడిపోవడం, అధికస్థాయిలలో కొనసాగుతున్న ముడిచమురు ధరలు, రాజకీయ భౌగోళిక ఆందోళనలు పెట్టుబడులను ప్రభావితం చేసినట్లు ఈవై పార్ట్‌నర్ వివేక్ సోనీ పేర్కొన్నారు. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఆల్టర్నేటివ్స్ 28.3 కోట్ల డాలర్ల పెట్టుబడులు గత నెలలో నమోదైన అతిపెద్ద డీల్‌గా నివేదిక తెలియజేసింది. బెంగళూరు, పుణేలలో ఆర్ఎంజెడ్ కార్యాలయ ఆస్తులలో ఇన్వెస్ట్ చేసినట్లు వెల్లడించింది.

### అందుబాటులోకి ఐటీఆర్--2

**న్యూఢిల్లీ:** ఆదాయపన్ను శాఖ 2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి (2025--26 ఆర్థిక సంవత్సరం) ఐటీఆర్--2 (రిటర్నుల పత్రం)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ఈ ఫైలింగ్ పోర్టల్‌పై రిటర్నుల దాఖలు సాధ్యపడుతుంది. వ్యాపారం లేదా వృత్తి నుంచి ఎలాంటి ఆదాయం లేని వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్‌యూఎఫ్‌లు), మూలధన లాభాలు ఆర్జించి ఉంటే ఐటీఆర్--2ను దాఖలు చేయాల్సి ఉంటుంది.




ఈ నెల 15న ఐటీఆర్--1, ఐటీఆర్--4 పత్రాలను సైతం ఆదాయపన్ను శాఖ అందుబాటులోకి తేవడం గమనార్హం. వ్యక్తిగత ఆదాయపన్ను చెల్లింపుదారులు ఐటీఆర్--1, 2 దాఖలుకు జూలై 31 తుది గడువుగా ఉంది. అదనంగా, ఈసారి ఐటీఆర్--2 ఫారంలో పన్ను చెల్లింపుదారుల కోసం కొన్ని కీలక మార్పులు చేసినట్లు ఆదాయపన్ను శాఖ వెల్లడించింది. ముఖ్యంగా విదేశీ ఆస్తులు, క్రిప్టో కరెన్సీ లావాదేవీలు, అధిక విలువ గల పెట్టుబడుల వివరాలను మరింత స్పష్టంగా వెల్లడించాల్సి ఉంటుంది. అలాగే ముందుగా నింపిన సమాచారం (ప్రీ--ఫిల్డ్) సౌకర్యాన్ని కల్పించడం వల్ల బ్యాంక్ వడ్డీలు, డివిడెండ్‌లు, టీడీఎస్ వివరాలు ఆటోమేటిక్‌గా కనిపించే అవకాశం ఉంది. దీంతో రిటర్నుల దాఖలు ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని అధికారులు పేర్కొన్నారు.

# ముకేశ్ అంబానీ వేతనం సున్నా..

## వరుసగా ఆరోసారి జీతం అందుకోని రిలయన్స్ చైర్మన్

**న్యూఢిల్లీ :** దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీ వరుసగా ఆరోసారి ఎలాంటి వేతనం అందుకోలేదు. 2008-09 నుంచి 2019-20 వరకు ప్రతియేటా రూ.15 కోట్ల వార్షిక రెమ్యునేషన్ అందుకున్న ముకేశ్.. 2020-21 నుంచి 2025-26 వరకు ఎలాంటి వేతనం తీసుకోలేదని సంస్థ వెల్లడించింది. ప్రస్తుతం ఆయన డివిడెండ్ మాత్రమే తీసుకుంటున్నారు. కరోనా సమయంలో తన వేతనాన్ని పూర్తిగా విరాళం ఇచ్చిన ఆయన ఆ సమయంలో భవిష్యత్తులో జీతం తీసుకోకూడదని నిర్ణయించుకున్నారు. ఇక అప్పటి నుంచి(2020-21 నుంచి 2025-26 వరకు) ఇప్పటి వరకు ఎలాంటి వేతనం పొందలేని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను కంపెనీ విడుదల చేసిన వార్షిక నివేదికలో ముకేశ్ అంబానీ ఎలాంటి వేతనం తీసుకోలేదని, అలవెన్స్‌లు, రిటైర్‌మెంట్ ప్రయోజనాలు మాత్రం పొందారు. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ కన్సాలిడేటెడ్ నికర లాభం 95,754 కోట్ల లాభాన్ని ఆర్జించగా, మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.18,19,103 కోట్లకు చేరుకున్నది. కంపెనీలో 1.61 కోట్ల షేరు కలిగివున్న ముకేశ్ అంబానీ గతేడాదికిగాను రూ.9.66 కోట్ల డివిడెండ్ చెల్లింపులు



జరిపారు. సంస్థలో ప్రమోటర్లు 664.5 కోట్ల షేర్లు లేదా 50.07 శాతం వాటా ఉండటంతో రూ.3,987 కోట్ల డివిడెండ్ చెల్లింపులు జరిపింది.

అలాగే అంబానీ బ్రదర్స్ నిఖిల్, హితాల్ మెస్వానీలు రూ.25 కోట్ల వార్షిక వేతనాన్ని అందుకున్నారు. వీటిలో రూ.10 కోట్లు..వేతనం, అలవెన్స్ వంటి రూపంలో ఆయన పొందారు. 2023లో కంపెనీ బోర్డులోకి చేరిన ఆయన పిల్లలు ఇషా, ఆకాశ్, అనంత్‌లు గత ఆరేండ్ల నుంచి ఎలాంటి వేతనం పొందలేదని పేర్కొంది. వీరు కేవలం వేతనం కింద రూ.12.17 కోట్లు(రూ.2.29 కోట్లు కమిషన్ కలుపుకొని) గతేడాదికిగాను పొందారు. కంపెనీ నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు రామిందర్ సింగ్ గుజ్రాల్, శుమీత్ బెనర్జీ, ఎస్బీఐ మాజీ చైర్‌పర్సన్ అరుంధతీ భట్టాచార్య, మాజీ సీవీసీ కేవీ చౌదరి, బ్యాంకింగ్ వెటరన్ కేవీ కామ్‌లు కమిషన్ కింద రూ.2.5 కోట్లు పొందారు. అంతక్రితం ఏడాది అందుకున్న రూ.2.25 కోట్లతో పోలిస్తే భారీగా పెరిగింది.

**రిటైల్ రంగం అంతంతే: రిలయన్స్**

దేశీయ సంఘటిత రిటైల్ రంగం స్వల్పకాలికంగా ఒత్తిడికి గురికాకతప్పదని రిలయన్స్ రిటైల్ వెల్లడించింది. అంతర్జాతీయంగా ప్రస్తుతం నెలకొన్న స్థూల ఆర్థిక పరిస్థితులు నిరాశాజనకంగా ఉండటం ఇందుకు కారణమని, కానీ, భవిష్యత్తులో ఈ రంగం రెండంకెల వృద్ధిని నమోదు చేసుకునే అవకాశాలున్నాయని పేర్కొంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రిలయన్స్ రిటైల్ రూ.3 లక్షల కోట్ల విక్రయాలు జరిపింది.

# రూపాయిని ఇంకా నష్టపోనివ్వాలి..

## మరికొంత కాలం ఆర్బీఐ జోక్యం చేసుకోవద్దు

**ముంబై, మే 28:** కరెన్సీ మార్కెట్‌లో రూపాయి పతనాన్ని స్వేచ్ఛగా కొనసాగనివ్వాలని, మరికొంత కాలం ఈ విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) జోక్యం చేసుకోవద్దని ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. అప్పుడే అంతర్జాతీయంగా ఎదురవుతున్న ఒత్తిళ్లను భారతీయ కరెన్సీ తట్టుకోగలదని వ్యాఖ్యానించారు. అలాగే ద్రవ్యోల్బణం విజృంభిస్తే.. దాన్ని కట్టడి చేసేందుకు వడ్డీరేట్ల పెంపునకు బదులు ఇతర ద్రవ్యపరమైన సాధనాలను వినియోగించాలని పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో ఆర్బీఐకి దువ్వూరి సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి (2026-27)గాను రెండో ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షను వచ్చే వారం ఆర్బీఐ చేపట్టనున్న క్రమంలో దువ్వూరి వ్యాఖ్యలు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. రూపాయి విలువ పతనాన్ని అడ్డుకోవడంలో ద్రవ్య విధానం పాత్ర ఎప్పుడూ చివర్లోనే అని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అయితే వడ్డీరేట్ల పెంపుతోనే ద్రవ్యోల్బణం ఆందోళనల్ని తగ్గించవచ్చని విశ్వసిస్తే ఆర్బీఐ ద్రవ్య విధానాన్ని కఠినతరం చేయవచ్చునని కూడా అన్నారు.

**తగ్గిస్తే అది.. పెంచితే ఇది..**

'కీలక వడ్డీరేట్లను తగ్గిస్తే దేశ ఆర్థిక వృద్ధికి మద్దతిచ్చినట్టవుతుంది. కానీ ద్రవ్యోల్బణం విజృంభించే ప్రమాదం ఉన్నది. పరిస్థితులు డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనానికీ దారితీయగలవు. అలాగే వడ్డీరేట్లను పెంచితే జీడీపీకి దెబ్బ. కాబట్టి ఈ విషయంలో బ్యాలెన్సింగ్.. ఆర్బీఐ ద్రవ్య విధాన కమిటీకి ఎప్పుడూ కత్తి మీద సామే' అని దువ్వూరి అభిప్రాయపడ్డారు. జూన్ 3-5 తేదీల్లో ఆర్బీఐ ద్రవ్య సమీక్ష జరుగనున్న విషయం తెలిసిందే. పశ్చిమాసియా సంక్షోభంతో అంతర్జాతీయ మార్కెట్‌లో పరుగులు పెడుతున్న ముడి చమురు ధరలు.. దేశీయ మార్కెట్‌లో ఇంధన ధరల్ని ఎగదోస్తున్నాయి. ఇప్పటికే లీటర్ పెట్రోల్, డీజిల్ రేట్లు దాదాపు రూ.8 చొప్పున ఎగిశాయి. సీఎన్‌జీ, వంటగ్యాస్ ధరలూ ఎగబాకాయి. ఈ నేపథ్యంలో రాబోయే ఆర్బీఐ ద్రవ్య సమీక్ష నిర్ణయాలు అత్యంత కీలకమని ఆర్థిక నిపుణులు అంటున్నారు. ప్రస్తుతం రెపో రేటు 5.25 శాతం వద్ద ఉన్నది. ఏడాది కిందట 6.50 శాతంగా ఉంటే.. 1.25 శాతం మేర ఆర్బీఐ తగ్గించింది.

**నిజంగా సవాలే..**

ప్రతికూల పరిస్థితుల్లో రూపాయి మారకం విలువను స్థిరీకరించడం నిజంగా ఓ సవాలేనని దువ్వూరి అన్నారు. కాగా, ఈ నెల 20న డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ తొలిసారి 97 మార్కు దరిదాపుల్లోకి వెళ్లింది. దీంతో ఆర్బీఐ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. అప్పట్నుంచి కొద్దికొద్దిగా కోలుకోవడం మొదలుపెట్టింది. 'మారకం రేటు సంక్షోభాలు చివరకు నమ్మకాన్నే దెబ్బతీస్తాయి. ఒకవేళ మదుపర్లు, దిగుమతిదారులు, ప్రజలు రూపాయి విలువ మరింత పడిపోతుందనే విశ్వసిస్తే.. ఇంకా అప్రమత్తమవుతారు. ఈ పరిణామం రూపాయిని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తుంది. అప్పుడు లాభాల కోసం ఎగుమతిదారులు తమ డాలర్లను వెనుకకు తీసుకురావడాన్ని ఆలస్యం చేస్తారు. ఫలితంగా దిగుమతిదారులు డాలర్ల కొనుగోలుకు ఎగబడుతారు. ప్రజలు బంగారంపై దృష్టి పెడితే.. మదుపర్లు నష్టాలను తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తారు' అని దువ్వూరి విశ్లేషించారు. ఈ సమయంలోనే ఆర్బీఐ, ఇతరత్రా విధానకర్తలు భయపడకుండా, రక్షణాత్మకంగా కాకుండా సమర్థవంతమైన నిర్ణయాలను తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

# మరొక్క అడుగు..

# ఫైనల్‌కు చేరేదెవరు?

**సాయి సుదర్శన్ - శుభ్‌మన్ గిల్.. నిలకడగా ఆడుతూ ఒక్కొక్క గేర్ మార్చుకుంటూ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లే జోడీ..**

**వైభవ్ సూర్యవంశీ- యశస్వి జైస్వాల్.. విధ్వంసకరమైన బ్యాటర్లు. వచ్చీరాగానే సిక్స్ కొడదామా లేకపోతే ఫోర్‌తో ఇన్నింగ్స్‌ను ఆరంభిద్దామా అనే బ్యాటర్లు..**

రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌లో ఆసక్తికర పోరు వీరిద్దరి మధ్యే అనడంలో సందేహం లేదు. శుక్రవారం జరగనున్న ఈ మ్యాచ్‌లో విజేతగా నిలిచే జట్టు ఫైనల్‌కు చేరుకొని.. కప్పు కోసం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడనుంది.



**ఓడినా.. ముందుకొచ్చి**

ఐపీఎల్ 2026 సీజన్ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచిన గుజరాత్ టైటాన్స్ తొలి క్వాలిఫయర్‌లో ఘోరంగా ఓడింది. ఆర్సీబీ బ్యాటర్ల ముందు బౌలింగ్ తేలిపోవడంతో ఏకంగా 254 పరుగులు సమర్పించుకుంది. లక్ష్య ఛేదనలో 162 పరుగులకే కుప్పకూలింది. టాప్ -3 బ్యాటర్లు విఫలమైతే పరిస్థితి ఎలా ఉంటుందో జీటీకి బాగా తెలిసొచ్చింది. ఐపీఎల్ ఆరెంజ్ క్యాప్ రేసులోని సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ నుంచి మంచి ఆరంభం వస్తేనే గుజరాత్ విజయావకాశాలు మెరుగ్గా ఉంటాయి. మరోవైపు, మిడిలార్డర్‌లో నిలకడగా ఆడే ప్లేయర్ లేకపోవడం జీటీ బలహీనత. బౌలింగ్ విషయంలో గుజరాత్‌కు పెద్దగా ఇబ్బందులేమీ లేవు. గత మ్యాచ్ మినహా మిగతా వాటిల్లో మెరుగైన ప్రదర్శన చేశారు. కగిసో రబాడ (26), రషీద్ ఖాన్ (19), సిరాజ్ (17) ఒక్కసారి లయను అందుకొంటే ప్రత్యర్థి బ్యాటర్లకు కష్టాలు తప్పవు. సాయి కిశోర్, వాషింగ్టన్ సుందర్ స్పిన్ ఆల్‌రౌండర్లతోపాటు జేసన్ హోల్డర్ వంటి పేస్ ఆల్‌రౌండర్ మంచి ఫామ్‌లో ఉన్నారు.

**అలా వచ్చి.. అద్భుత విజయంతో**

రాజస్థాన్ ప్రయాణం చాలా క్లిష్టమైంది. నాకౌట్ స్టేజ్‌కు చేరుకోవడానికే చాలా ఇబ్బందులు పడింది. వైభవ్ సూర్యవంశీ, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్ నుంచి నిలకడగా పరుగులు వస్తున్నాయి. మరోవైపు, యశస్వి, ఫెర్రీరా అప్పుడప్పుడు మినహా.. తమదైన శైలిలో ఈసారి సీజన్‌లో ప్రభావం చూపించలేదు. ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్‌పై టాప్ ఆర్డర్ అదరగొట్టినా.. మిడిలార్డర్ ఇబ్బంది పడటంతో అనుకున్నంత మేర స్కోరును సాధించలేదని ఆ జట్టు సారథే చెప్పాడు. రాజస్థాన్ బౌలింగ్ యూనిట్‌ను జోఫ్రా ఆర్చర్ ముందుండి నడిపించాడు. ఎస్ఆర్‌హెచ్‌పై కీలక బ్యాటర్లను పెవిలియన్‌కు పంపించి దెబ్బ కొట్టాడు. అతడికి తోడుగా నాంద్రీ బర్గర్ చెలరేగడం ఆర్ఆర్‌కు కలిసొచ్చింది. రవీంద్ర జడేజా సైలెంట్‌గా వికెట్లు తీస్తూ జట్టు విజయంలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. మరో స్పిన్నర్ యశ్ రాజ్ పుంజా కూడా మెరుగైన ప్రదర్శన చేస్తున్నాడు.

**ముఖాముఖి..**

ఇప్పటి వరకు ఐపీఎల్‌లో గుజరాత్ - రాజస్థాన్ జట్లు 10సార్లు తలపడ్డాయి. శుభ్‌మన్ గిల్ నాయకత్వంలోని గుజరాత్ ఏడు మ్యాచుల్లో గెలిచింది. మరో మూడింట్లోనే రాజస్థాన్ విజయం సాధించింది.

## స్పోర్ట్స్

### వేలంలోకి వైభవ్ సూర్యవంశీ..

### రూ.30 కోట్లు చెల్లిస్తానన్న సెహ్వాగ్



**ఇంటర్నెట్ డెస్క్:** సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో రాజస్థాన్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 29 బంతుల్లోనే 5 ఫోర్లు, 12 సిక్స్‌లు బాది 97 పరుగులు చేశాడు. ఈ సంచలన ఇన్నింగ్స్‌తో ఐపీఎల్‌లో ఒక సీజన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా క్రిస్ గేల్ (59) పేరిట ఉన్న రికార్డును వైభవ్ (65) బ్రేక్ చేశాడు. ఈ నేపథ్యంలో మాజీ ఆటగాళ్లు వైభవ్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఎలిమినేటర్ మ్యాచ్ సందర్భంగా వీరేంద్ర సెహ్వాగ్, హర్భజన్ సింగ్ కామెంటెటరీ చేశారు. వీరి మధ్య వైభవ్ టాపిక్ వచ్చింది. ఒకవేళ సూర్యవంశీ వేలంలోకి వస్తే ఎంత డబ్బు చెల్లిస్తారని సెహ్వాగ్‌ని హర్భజన్ అడిగాడు. సెహ్వాగ్ ఏ మాత్రం ఆలోచించకుండా తాను రూ.30 కోట్లు చెల్లిస్తానని చెప్పాడు. నచ్చనివాళ్లు.. నీకు 15 ఏళ్లు కాదంటారు: వైభవ్‌కు రస్సెల్ కీలక సూచన వైభవ్‌లో స్పెషల్ టాలెంట్ ఉంది: అరుణ్ ధుమాల్ ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ కూడా వైభవ్‌పై ప్రశంసలు కురిపించారు. అతనిలో 'స్పెషల్ టాలెంట్' ఉందని.. ఈ కుర్రాడు మరింత రాటుదేలడానికి బీసీసీఐ, రాజస్థాన్ రాయల్స్ మార్గదర్శకత్వం అందిస్తాయని పేర్కొన్నారు. "వైభవ్ టెంపర్‌మెంట్ ఇలానే కొనసాగేందుకు అవసరమైన మార్గదర్శకత్వాన్ని బీసీసీఐ, రాజస్థాన్ ఫ్రాంఛైజీ అందిస్తాయి. క్రీడల్లో కేవలం శారీరకంగానే కాదు మానసికంగానూ దృఢత్వం అవసరం. అతను రాబోయే మరెన్నో సంవత్సరాలపాటు టీమ్ఇండియా తరఫున రాణించేలా చూడటంలో మా వంతు కృషిని మేం తప్పకకుండా చేస్తాం" అని అరుణ్ ధుమాల్ తెలిపారు.

వేరే పరిశ్రమకి వెళ్లినప్పుడు అక్కడి స్థానిక భాష మాట్లాడటం చాలా ముఖ్యమని, ఇదంతా పబ్లిసిటీ కోసం కాదని అంటోంది అందాల తార శ్రీలీల. భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకుల్ని అలరించే ఈ భామ.. తన డ్యాన్స్‌తో కుర్రకారుని ఉర్రూతలూగిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె వివిధ ప్రాంతాల ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వడం గురించి మాట్లాడింది. "నా విషయానికొస్తే... నేను ప్రతి భాషను గౌరవిస్తాను. పలు చిత్రపరిశ్రమల్లో అవకాశాలు అందుకుంటూ పనిచేస్తున్నా... కాబట్టి ఒక ప్రాంతానికి వెళ్లినప్పుడు తప్పకుండా అక్కడి భాషలోనే మాట్లాడతా. ఆ ప్రదేశానికి, అక్కడి భాషకు, ప్రజలకు ఇచ్చే గౌరవం అది. సినీతారలకు, ప్రేక్షకులకు మధ్య భాష ఒక భావోద్వేగ వారధిలాగా ఉంటుంది. అందుకే ప్రచార కార్యక్రమాల్లో స్థానిక భాషల్లో మాట్లాడటం వల్ల వారి మధ్య దూరం తగ్గుతుందనేది నా అభిప్రాయమ"ని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె హిందీలో కార్తిక్ ఆర్యన్‌తో ఓ ప్రేమకథా చిత్రంతో పాటు ధనుష్ నటిస్తున్న మరో సినిమాలో నాయికగా నటిస్తుంది



# ఇదంతా పబ్లిసిటీ కోసం కాదు!

# ఈ ప్రయాణంలో మీకు మీరే స్నేహితులు

కళా రంగమే కాదు.. మీరు ఎంచుకున్న ఏ ప్రపంచంలోనైనా మీ ప్రయాణం వ్యక్తిగతమైనదే అంటోంది కథానాయిక ఐశ్వర్య రాయ్. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె చిత్రపరిశ్రమలో రాణించాలనుకున్నప్పుడు వ్యక్తిత్వానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత గురించి తన అభిప్రాయాన్ని పంచుకుంది. "నటిగా ఇప్పటికీ ప్రతిరోజు కొత్తగానే భావిస్తాను. సృజనాత్మకతతో కూడిన ఈ ప్రపంచంలో మనల్ని మనం వెతుక్కునే నిరంతర ప్రయాణం ఇది. అలాంటిది ఎవరికో సలహాలు ఇచ్చేంత గొప్ప స్థానంలో నేను ఉన్నానని అనుకోను. ప్రేక్షకులు నాపై చూపే ప్రేమ, ఆదరాభిమానాలకు ఎల్లప్పుడూ కృతజ్ఞురాలినే. కానీ, కళా రంగమే కాదు.. ఎంచుకున్న ఏ ప్రపంచంలోనైనా మీ ప్రయాణం వ్యక్తిగతమైనది. మీ అనుభవాలే మీకు జీవితంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోగలరో తెలుసుకునేందుకు సహాయపడతాయి. ఎందుకంటే ఒక్కొక్కరిది ఒక్కో రకమైన దృష్టి కోణం. నేను చెప్పాలని అనుకున్నదల్లా ఒక్కటే.. ఇప్పుడున్న పరిస్థితుల్లో మీ చుట్టూ ఏం జరుగుతుందో మీరు ఊహించలేరు. ప్రతి విషయాన్ని ఒక ప్రణాళికతో కృత్రిమంగా చేయడానికే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. నిజమో కాదో తెలుసుకునేలోపే అంతా జరిగిపోతుంది. యువతరం ఇలాంటి వాటిని చూసి పక్కదారి పట్టకూడదు. బయటకు వెళ్లండి. మీ అభిరుచిని తెలుసుకోండి. మీ నిర్ణయాలతో నిజాయతీగా మెలగండి. ఆ ప్రయాణంలో మీకు మీరే మంచి స్నేహితులుగా నిలబడాలి. ఈ నకిలీ ప్రపచంలో ఫన్, మ్యాజిక్‌లతో పాటు ఒక వ్యక్తి ఏం చేయగలడో అనే వాటిని అన్వేషించేడంలో ఆనందం ఉండదు. ముందు సజీవంగా ఉండి జీవితాన్ని అర్థం చేసుకోవాలి. ఆ తర్వాత ఆ అనుభూతిని మీ కళలోకి తీసుకురావాలి. మీరు ఎవరనే దానికి నిజాయతీగా ఉండండి. అలానే నిత్య విద్యార్థిగా ఉంటూ మీతో మీరు నిజాయతీగా ఉండండి. సొంత అనుభవాలే మిమ్మల్ని ఒక మంచి నటుడిగా తీర్చిదిద్దుతాయి. వాటన్నింటినీ స్వీకరిస్తూ మీ ప్రయణాన్ని సాగించాలి. మిగిలినవన్నీ జరగాల్సిన సమయానికి అవే జరిగిపోతాయి, రావాల్సినవి వస్తాయి" అని చెప్పింది.




# 'పెద్ది' పైరసీకి అడ్డుకట్ట.. మద్రాస్ హైకోర్టు కీలక ఉత్తర్వులు

'పెద్ది' సినిమా పైరసీకి అడ్డుకట్ట వేసేందుకు మద్రాస్ హైకోర్టు కీలక ఉత్తర్వులిచ్చింది. ఈ సినిమాకు యాంటీపైరసీ ఇంజంక్షన్ జారీ చేసింది. సినిమా కాపీరైట్‌కు సంబంధించి చిత్ర నిర్మాణ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన హైకోర్టు వెకేషన్ బెంచ్ ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ఈ సినిమాను (Peddi) ఇంటర్నెట్‌లో అక్రమంగా అప్‌లోడ్ చేయడం, ప్రసారం చేయడం, కాపీ చేయడాన్ని నిరోధిస్తూ న్యాయస్థానం ఈ ఆదేశాలిచ్చింది. సినిమా అనధికారికంగా ఇంటర్నెట్‌లో లీక్ అయితే నిర్మాతలకు భారీ నష్టం వాటిల్లుతుందని కోర్టు ఈ సందర్భంగా అభిప్రాయపడింది.

'యాంటీ పైరసీ ఇంజంక్షన్' (AntiPiracy Injunction) అనేది కాపీరైట్ హక్కుదారులు తమ కంటెంట్ (సినిమాలు, వెబ్‌సిరీస్‌లు) అక్రమంగా కాపీ కాకుండా, పైరసీ వెబ్‌సైట్లలో ప్రసారం కాకుండా కోర్టుల ద్వారా పొందే ఒక న్యాయపరమైన రక్షణ ఉత్తర్వు. ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేసిన వెంటనే, కొత్త యూఆర్ఎల్‌తో అదే కంటెంట్ రాకుండా కొత్త సైట్‌లను కూడా ఆటోమెటిక్‌గా బ్లాక్ చేయడానికి ఈ 'డైనమిక్ ఇంజంక్షన్' (Dynamic Injunction) ఉత్తర్వులను కోర్టులు జారీ చేస్తుంటాయి.

గతకొంత కాలంగా ఇండస్ట్రీని పైరసీ భూతం వెంటాడుతోన్న విషయం తెలిసిందే. ఇటీవల కూడా విజయ్ 'జననాయగన్' విడుదలకు ముందే నెట్టింట ప్రత్యక్షమైంది. ఇలాంటివి జరగకుండా 'పెద్ది' టీమ్ ముందడుగు వేయడంపై అందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. రామ్ చరణ్ (Ram Charan) హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలు దీనిపై అంచనాలు పెంచేశాయి.






## స్వాతంత్ర్య దినోత్సవం స్పెషల్‌గా రాబోతున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్'..

తమిళ స్టార్ హీరో సూర్య తన కెరీర్‌లో తొలిసారిగా 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో పూర్తి స్థాయి తెలుగు చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో మమితా బైజు హీరోయిన్ కాగా.. రవీనా టాండన్, రాధికా శరత్‌కుమార్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ఫిక్స్ చేస్తూ అధికారిక ప్రకటన రిలీజ్ చేశారు మేకర్స్. 'ప్రియమైన అభిమానులారా.. ఈ వేడుకలను ఇలాగే కొనసాగించడానికి మా దగ్గర అదిరిపోయే అప్డేట్ ఉన్నది. విశ్వనాథ్ అండ్ సన్స్ కోసం దారి ఇవ్వండి.. ఆగస్టు 14, 2026న ప్రపంచవ్యాప్తంగా ఉన్న థియేటర్లను జయించడానికి వస్తున్నారు' అంటూ అదిరిపోయే పోస్టర్‌ను షేర్ చేశారు. విడుదల చేసిన పోస్టర్‌లో సూర్య చేతిలో గొడుగు, ఫోన్ పట్టుకుని సీరియస్ అండ్ స్టైలిష్ లుక్‌లో కనిపిస్తూ ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తున్నాడు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం, అలాగే వీకెండ్స్ కావడంతో ఈ సెలవులు సినిమా సక్సెస్‌కు మరింత ప్లెస్ అయ్యే అవకాశం ఉన్నట్లు ఖుష్ అవుతున్నారు అభిమానులు. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన అప్డేట్స్ ఆకట్టుకోవడంతో పాటు.. తెలుగులో సూర్య మొదటి చిత్రం కావడంతో ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకుల్లో కూడా 'విశ్వనాథ్ అండ్ సన్స్'పై భారీ అంచనాలు ఉన్నాయి. కాగా.. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.



'బలగం' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు వేణు యెల్దండి తెరకెక్కిస్తున్న లేటెస్ట్ ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ'. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నాడు. దీంతో టాలీవుడ్‌లో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. దిల్ రాజు ఈ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అయితే, ఈ సినిమాలో హీరోయిన్ మాత్రం ఇంకా ఫైనల్ కాలేదు. గతంలో పలువురు ముద్దుగుమ్మల పేర్లు వినిపించగా.. కీర్తి సురేష్ ఆల్మోస్ట్ ఫైనల్ అయిందని అన్నారు. ఇటీవల మృణాల్ ఠాకూర్‌ను సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. 'సీతారామం', 'హాయ్ నాన్న' చిత్రాలతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్న మృణాల్.. ఈ ఎమోషనల్ రోల్‌కు పర్‌ఫెక్ట్‌గా సెట్ అవుతుందని మేకర్స్ భావించారు. దీనిపై ఆమెతో చర్చలు కూడా జరిగాయని అన్నారు. కానీ ఇప్పుడు ఈ ప్రెస్టెజీయస్ ప్రాజెక్ట్‌లో యంగ్ సెన్సేషన్ మమితా బైజు పేరు వినిపిస్తోంది. 'ప్రేమలు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ యంగ్ బ్యూటీ.. ప్రస్తుతం వరుస ప్రాజక్ట్‌స్‌తో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో.. ఎల్లమ్మలో మమిత ఛాన్స్ దక్కించుకున్నట్టుగా సమాచారం. ప్రస్తుతానికి మేకర్స్ ఆమెతో సంప్రదింపులు జరుపుతున్నట్లు టాక్. ఒకవేళ అంతా అనుకున్నట్లు జరిగితే, డీఎస్‌పీ సరసన మమితా బైజు జోడీ కట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ క్రేజీ కాంబినేషన్‌పై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతానికి మాత్రం ఎల్లమ్మ ఎవరు అనేది సస్పెన్స్‌లోనే ఉంది.

# 'ఎల్లమ్మ' కోసం యంగ్ సెన్సేషన్?




## వారణాసి కోసం మహేష్ భారీ రిస్క్.. ఏకంగా నెల రోజుల పాటు నరకమే !

ప్రిన్స్ మహేష్ బాబు లేటెస్ట్ గా నటిస్తున్న సినిమా వారణాసి. రాజమౌళి దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. పాన్ ఇండియా రేంజ్ లో వస్తున్న ఈ మూవీ.. టైం ట్రావెల్, మైథాలజీ కాన్సెప్ట్ తో వస్తున్నట్లు టాక్ నడుస్తోంది. ఈ సినిమాలో మహేష్ బాబు రుద్ర అనే శివ భక్తుడి పాత్రలో మెరువనున్నారు. ఇప్పటికే ఈ సినిమా టైటిల్ టీజర్ రిలీజ్ కాగా, అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం శరావేగంగా ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది.

ఇలాంటి క్రమంలో ఈ మూవీ నుంచి అదిరిపోయే అప్డేట్ వచ్చేసింది. ఈ సినిమా షూటింగ్ లో భాగంగా వచ్చే నెల మొదటి వారం నుంచి ఓ యాక్షన్ షెడ్యూల్ ప్రారంభం కాబోతుందట. ఈ 30 రోజుల పాటు నాన్ స్టాప్ గా యాక్షన్స్ షూట్ జరగనున్నట్లు టాక్ నడుస్తోంది. ప్రతిరోజు మహేష్ బాబు హాజరు కాబోతున్నట్లు సమాచారం. అంటే ఈ నెల రోజుల పాటు మహేష్ బాబు యాక్షన్ మోడ్ లో ఉంటాడన్నమాట. ఈ యాక్షన్ సీన్ సినిమాకు హైలెట్ గా నిలుస్తుందని కూడా అంటున్నారు. దీంతో మహేష్ బాబు ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు.

## ఫ్యాన్స్ వార్ సృష్టించడం వల్ల జరిగేదేం ఉండదు..

సెలబ్రిటీలకు ఫ్యాన్స్ ఉండటం చాలా కామన్. అయితే.. కొందరు ఫ్యాన్స్ మాత్రం మా హీరో /హీరోయిన్ గొప్పా అంటే మా వాళ్లు గొప్పా అంటూ సోషల్ మీడియాలో వార్ సృష్టిస్తుంటారు. తాజాగా ఇలాంటి సంఘటనే బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌతేలాకు ఎదురైంది. ఏఐ ద్వారా సృష్టించిన ఓ ఫొటోలో ఐశ్వర్యరాయ్‌ను గ్లోబల్ బ్యూటీగా, ఆ తర్వాత కేటగిరిలో దీపిక పదుకొణె, ప్రియాంక చోప్రా, మాధురీ దీక్షిత్ ఉన్నారు. ఇక వాళ్ల ముందు మోకరిల్లి పాదాలు నమస్కరిస్తున్నట్లుగా నటి ఊర్వశితో పాటు ఆలియా భట్, కరీనా కపూర్, కత్రినా కైఫ్ ఉన్నారు. ప్రస్తుతం ఈ ఏఐ ఫొటో వైరల్ అవుతుండగా ఊర్వశి దానిపై ఘాటుగా స్పందించింది. ఈ మేరకు తన సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ షేర్ చేస్తూ.. 'ప్రతి నటికి తనకంటూ సొంత జర్నీ ఉంటుంది. ఆ జర్నీలో ఎంతో కష్టపడుతుంది. అలాంటి మహిళల్ని పోలుస్తూ ఫ్యాన్ వార్ సృష్టించడం వల్ల జరిగేది ఏం ఉండదు. అది కేవలం నెగిటివిటీని వ్యాప్తిచేయడం మాత్రమే అవుతుంది. దానికి బదులుగా టాలెంట్‌ను గుర్తించండి, వారి ఎదుగుదలను ప్రోత్సహించండి. దయతో ప్రవర్తించడం నేర్చుకోండి. ఇలా విషం చిమ్మడం ఆపేయండి' అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈమె పోస్ట్ వైరల్ అవుతుండగా.. తనకు సపోర్ట్‌గా నిలిస్తూ.. 'ఎవరి ప్రతిభ వాళ్లది.. ఎవరిని కించపరచొద్దు' అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు.



Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,**
Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com